మంగళవారం
14-06-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 70, సంచిక : 351
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

బీసీసీఐకి కాసుల పంట

ఐపీఎల్ మీడియా హక్కుల కోసం 2023-2027 కాలానికి గాను మొత్తం నాలుగు ప్యాకేజీలుగా విభజించి నిర్వహిస్తున్న ఈ-వేలంలో టీవీ, డిజిటల్ హక్కులను రూ.44,075కు రెండు బ్రాడ్‌కాస్టింగ్ సంస్థలు దక్కించుకున్నాయి. టీవీ ప్రసార హక్కులను సోనీ దక్కించుకుంది. 410 మ్యాచ్‌లకు ఈ మొత్తాన్ని చెల్లిస్తున్నట్లు తెలిసింది. టీవీ హక్కుల విలువ కంటే డిజిటల్ హక్కుల విలువ 10 శాతం తక్కువగా ఉందని అనలిస్టులు అంచనా వేస్తున్నారు.

8 లో

ఏరువాక
హడావుడేది?

తగ్గని ఎండ తీవ్రత

- జాడ లేని వాన
- సాగని దుక్కి పనులు
- రుతుపవనాల దోబూచులాట
- అన్నదాతల ఆందోళన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏటా అన్నదాతలు అత్యంత ఆనందంతో జరుపుకునే ఏరువాక పౌర్ణమి పండుగ హడావుడి ఈసారి మచ్చుకైనా కానరావడం లేదు. ఈ సమయంలో ఎటుచూసినా ట్రాక్టర్లు, నాగళ్లతో దుక్కుల పనులతో వాతావరణం కోలాహలంగా ఉండేది. కానీ క్షేత్రస్థాయి పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. ఎండల తీవ్రత ఏమాత్రం తగ్గకపోవడం, ఇంతవరకు గట్టి వర్షం ఒక్కటీ పడకపోవడంతో పొలాలు బీటలు వారి ఆవిరెత్తుతున్నాయి. దీంతో దుక్కులు దున్నడానికి పొలాలు ఏమాత్రం అనుకూలించడం లేదు. పునాస, ఖరీఫ్ పంటల సాగు కోసం రైతులు విత్తనాలతో సిద్ధంగా ఉన్నప్పటికీ, రుతుపవనాలు దోబూచులాడుతున్నాయి. దీంతో పల్లెల్లో అంబరాన్ని అంటాల్సిన ఏరువాక పౌర్ణమి సంబరాల ఆనవాళ్లు కానరావడం లేదు. సాధారణంగా రోహిణీ కార్తె ప్రారంభంలో కురిసే వర్షాలకు దుక్కులు దున్ని పొలాలు శుభ్రం చేసుకుంటారు. ఆ తర్వాత ఏ ఒక్క వర్షం కురిసినా పునాస పంటల సాగుకి ఉపక్రమిస్తారు. వరి నారుమళ్లు పోస్తారు. ఈనెల 14వ తేదీ జరిగే ఏరువాక పౌర్ణమి నాటికి వ్యవసాయ పనుల హడావుడి స్పష్టంగా కనపడేది. అటువంటిది ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా ఏరువాక సాగే పరిస్థితి ఏ జిల్లాలోనూ కన్పించడం లేదు. ఇంతవరకు నైరుతి రుతుపవనాలు రాష్ట్రమంతా విస్తరించలేదు. వాస్తవానికి గత నెల 29వ తేదీనే కేరళను తాకిన రుతుపవనాలు తమిళనాడు, కర్ణాటక, ఇతర రాష్ట్రాలకు విస్తరించాయి. కానీ ఏపీని మాత్రం ఇంకా తాకలేదు. ఫలితంగా తేమ గాలులు లేకపోవడంతో ఎండలు ఇంకా భగభగమంటున్నాయి. దీనికితోడు వడగాడ్పులు కొనసాగుతున్నాయి. మరో నాలుగైదు రోజుల దాకా ఇటువంటి పొడి వాతావరణమే ఉంటుందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. వ్యవసాయశాఖ అంచనా మేరకు ఈనెలలో ఇప్పటివరకు 33.3 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉంది. కానీ 21.8 మిల్లీమీటర్ల వాన మాత్రమే నమోదైంది. అది కూడా అన్ని ప్రాంతాల్లో సమానంగా లేదు. కొత్తగా ఏర్పాటైన జిల్లాల వారీగా నమోదైన వర్షపాతాన్ని పరిశీలిస్తే 17 జిల్లాల్లో చినుకు జాడే లేదు. ఉత్తరాంధ్ర, దక్షిణకోస్తా, రాయలసీమలో సాధారణం కంటే తక్కువగా ఉంది. వర్షాలు ఆలస్యమైతే పంటల సాగుకు అనేక అవరోధాలు ఏర్పడడంతోపాటు పెట్టుబడులు గణనీయంగా పెరిగే అవకాశం ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మాత్రం కేరళ రాష్ట్రాన్ని తాకిన రుతుపవనాలను, రాష్ట్రంలో రిజర్వాయర్‌లతో ఉన్న నీటి నిల్వలను ఆధారం చేసుకుని ముందుగానే సాగునీరు విడుదల చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు జూన్ 1న గోదావరి డెల్టాకు నీరు విడుదల చేయగా, కృష్ణా డెల్టాకు 10వ తేదీన విడుదల చేశారు. పెన్నా బేసిన్, శ్రీశైలం దిగువ ప్రాంతాలకు కూడా ఈ నెలలోనే నీరు విడుదల చేయనున్నారు. వచ్చే నెల 15న సాగర్ ఆయకట్టుకు నీరిస్తామని జల వనరుల శాఖ ప్రకటించింది. దీంతో రైతులు వరి నారుమళ్లు పోసేందుకు సన్నద్ధమవుతున్నారు. పులిచింతల రిజర్వాయర్‌లో దాదాపు 32 టీంఎసీల నీరు నిల్వ ఉండడంతో పట్టిసీమ ఎత్తిపోతల ప్రారంభించే అవసరం లేకుండానే కృష్ణాడెల్టాకు సాగునీరు విడుదల చేశారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది ఖరీఫ్‌లో రాష్ట్రవ్యాప్తంగా 95.35 లక్షల ఎకరాల్లో పంటల సాగు లక్ష్యంగా పెట్టుకోగా 88.80 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఇందులో వరి అత్యధికంగా 39.15, నూనెగింజలు 17.60, పత్తి 13.05, అపరాలు 7.40, చిరుధాన్యాలు 4.65, మిర్చి 4.60, మిగతా పంటలు 2.35 లక్షల ఎకరాల్లో పండించారు. ఈ ఏడాది రాష్ట్రంలోని దాదాపు అన్ని రిజర్వాయర్లలో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నందున లక్ష్యానికను గుణంగా పంటల సాగు జరుగుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ఆ మేరకు ఈ ఏడాది ఖరీఫ్‌లో 96.42 లక్షల ఎకరాల సాగును వ్యవసాయశాఖ లక్ష్యంగా నిర్దేశించి, వివిధ రకాల

- మిగతా 2 లో

ఆరోగ్యశ్రీలోకి మరిన్ని...

- ప్రసవానికి రూ.5వేలు
- క్యాన్సర్ కేర్‌పై ప్రత్యేక దృష్టి
- వైద్య ఆరోగ్యశాఖ సమీక్షలో సీఎం జగన్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆరోగ్య ఆసరా కింద ఇకపై ప్రతి ప్రసవానికి తల్లికి రూ.5వేలు చెల్లించాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. వైద్యారోగ్య శాఖపై తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం సీఎం సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కోవిడ్ పరిస్థితులు, ఆరోగ్యశ్రీ, దాని కింద కార్యక్రమాలు, వైద్య ఆరోగ్యశాఖలో నాడు-నేడు కింద చేపడుతున్న పనులు, కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణం, క్యాన్సర్ కేర్ తదితర అంశాలపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ఏ తరహా ప్రసవం జరిగినా తల్లికి రూ.5 వేలు ఇవ్వాలని సీఎం ఆదేశించారు. గతంలో సిజేరియన్ జరిగితే రూ.3వేలు ఇస్తుండగా, ఇప్పుడు దానిని రూ.5వేలకు పెంచారు. అలాగే సహజ ప్రసవాలను ప్రోత్సహించేందుకు వారికి కూడా రూ.5వేలు ఇవ్వాలని సూచించారు. ఆరోగ్యశ్రీ కింద అందుతున్న వివిధ కార్యక్రమాలకు ప్రభుత్వం చేస్తున్న ఖర్చును అధికారులు సీఎంకు వివరించారు. ఆరోగ్యశ్రీలో 2,446 ప్రొసీజర్లు కవర్ అవుతున్నాయని తెలిపారు. కేవలం ఆరోగ్యశ్రీ, దానికింద కార్యకలాపాల కోసం ఏడాదికి దాదాపు రూ.4వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని, గతేడాది ఆయుష్మాన్ భారత్ కింద రాష్ట్రానికి వచ్చింది కేవలం రూ. 223 కోట్లు మాత్రమేనని అధికారులు వెల్లడించారు. ఈ ఏడాది రూ.360 కోట్లు ఇచ్చే అవకాశం ఉందని అంచనా వేసినట్టు చెప్పారు. ఆరోగ్యశ్రీపై నిరంతర అధ్యయనం చేయాలని, అవసరాల మేరకు మరింత మంచి చేయడానికి ప్రొసీజర్ల సంఖ్యను పెంచాలని సీఎం ఆదేశించారు. నేరుగా లబ్ధిదారుడి ఖాతాలోకి డబ్బు, అక్కడ నుంచి ఆస్పత్రికి ఆటోడెబిట్‌లో చెల్లింపులు, ఎవ్వరికీ అసౌకర్యం కలగకుండా ఈ ప్రక్రియ కొనసాగాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తర్వాత కోవిడ్ పరిస్థితులపై సీఎం సమీక్షించారు. 18 సంవత్సరాల్లోపు వారికి రెండు డోసులు దాదాపుగా పూర్తి చేశామని, 15 నుంచి 17 ఏళ్లలోపు వారికి 99.65శాతం వాక్సినేషన్ పూర్తి కాగా, 12 నుంచి 14 ఏళ్లలోపు వారికి 97.78శాతం వాక్సినేషన్ పూర్తి చేసినట్లు అధికారులు వివరించారు. విలేజ్ క్లినిక్స్, వార్డు క్లినిక్స్, కొత్త ఆస్పత్రుల నిర్మాణం, వీటిలో అభివృద్ధి పనులు నిర్దేశించుకున్న సమయంలోగా పూర్తిచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇప్పటివరకు పీహెచ్‌సీల్లో 977 సెంటర్లలో అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, కొత్తవాటి నిర్మాణం చురుగ్గా సాగుతోందని అధికారులు చెప్పారు.

క్యాన్సర్ కేర్‌పై ప్రభుత్వం దృష్టి

భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని, 2020లో ఏపీలో 34వేల మంది క్యాన్సర్ కారణంగా మృతి చెందిన నేపథ్యంలో దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. విలేజ్ క్లినిక్స్ స్థాయిలోనే క్యాన్సర్ లక్షణాలను గుర్తించాలని, అందుకోసం విలేజ్ క్లినిక్స్, వార్డు క్లినిక్స్, పీహెచ్‌సీలను వీలైనంత

- మిగతా 2 లో

విపక్షాల రాష్ట్రపతి అభ్యర్థి పవార్?

న్యూదిల్లీ: రాష్ట్రపతి ఎన్నికలు సమీపిస్తున్న వేళ అభ్యర్థి ఎంపిక, మద్దతు కూడగట్టడంపై అధికార, విపక్షాలు ముమ్మర కసరత్తు చేస్తున్నాయి. అభ్యర్థిని ప్రకటించడంలో అధికార బీజేపీ మౌనం వహిస్తుండగా ప్రతిపక్షాలు మాత్రం వరుస భేటీలు సాగిస్తున్నాయి. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఇప్పటికే అనేకమంది విపక్ష నేతలకు లేఖలు రాయడం, ఫోన్‌లో మాట్లాడటం ద్వారా మద్దతు కూడగడుతుండగా...కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ సైతం ఇప్పటికే అనేక పార్టీల నేతలతో సంప్రదింపులు జరిపారు. వచ్చే నెలలో జరగబోయే రాష్ట్రపతి ఎన్నికల్లో విపక్షాల అభ్యర్థిగా కేంద్ర మాజీమంత్రి, ఎన్సీపీ అధినేత శరద్ పవార్ పోటీ చేయబోతున్నట్లు విస్తృత ప్రచారం జరుగుతుంది. ఆప్ నాయకులు సైతం పవార్‌తో ఇప్పటికే చర్చలు జరిపారు. పవార్ నుంచి ఎలాంటి ప్రకటన వెలువడనప్పటికీ ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా ఆయనే బరిలో నిలవబోతున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రపతి ఎన్నికను ఏకగ్రీవం చేసేలా బీజేపీ కసరత్తు చేస్తుండగా..మోదీ సర్కార్‌ను దీటుగా ఎదుర్కొనేందుకు సరైన అభ్యర్థిని ఎంపిక చేసేందుకు ప్రతిపక్ష పార్టీలు జోరుగా పావులు కదుపుతున్నాయి. ఇప్పటివరకు విపక్షాలు నిర్వహిస్తున్న సమావేశాల ఆధారంగా ఉమ్మడి అభ్యర్థిగా శరద్ పవార్‌వైపే మొగ్గుచూపుతున్నట్టు స్పష్టమవుతోంది. రాష్ట్రపతి ఎన్నికకు ప్రతిపక్షాల తరపున ఉమ్మడి అభ్యర్థి ఎవరనే అంశం చర్చకు వస్తున్న ప్రతిసారీ పవార్ పేరే వినిపించడం తెలిసిందే. తదుపరి రాష్ట్రపతి ఎన్నికకు తమ అభ్యర్థిగా శరద్ పవారే ఉండాలని ఎక్కువ ప్రతిపక్షాలు కోరుతున్నాయి. పవార్‌ను అభ్యర్థిగా నిలబెట్టాలని కాంగ్రెస్ కూడా తీవ్ర ప్రయత్నాలే చేస్తోంది. ఇందులో భాగంగా ఆ పార్టీ సీనియర్ నేత మల్లిఖార్జున ఖర్గే గురువారం శరద్‌పవార్‌తో భేటీ అయ్యారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ మనోగతాన్ని ముంబై వెళ్లి పవార్‌కు వివరించారు. అయితే, పవార్ స్పందించలేదని తెలుస్తోంది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్‌లతోనూ ఖర్గే చర్చలు జరిపారు. బెంగాల్ సీఎం మమతా బెనర్జీతోనూ ఆయన ఫోన్‌లో సంప్రదించారు. ఆప్ నేత సంజయ్ సింగ్ ఆదివారం శరద్‌పవార్‌ను కలిసి చర్చించారు. రాష్ట్రపతి ఎన్నికలపైనే వారు చర్చించినట్లు తెలుస్తోంది. రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి ఈ నెల 15న దిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్‌లో ప్రతిపక్ష పార్టీలన్నింటితో మమతా బెనర్జీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికలపై ప్రతిపక్షాలు అనుసరించాల్సిన ఉమ్మడి వ్యూహాన్ని ఖరారు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. శరద్ పవార్ దేశంలోనే సీనియర్ రాజకీయ దిగ్గజం. అనేక పార్టీల మధ్య పొత్తులు, సంకీర్ణ ప్రభుత్వాలను నెలకొల్పడంలో కీలకపాత్ర

- మిగతా 2 లో

చలో హన్మకొండలో పాల్గొన్న పేదలు. (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న నారాయణ. పక్కన శ్రీనివాస్, జ్యోతి, రవి, భిక్షపతి, రమేశ్ తదితరులు

ఇళ్లకోసం రోడ్డెక్కిన పేదలు

- హన్మకొండలో సీపీఐ భారీ ప్రదర్శన
- ప్రజలవైపా...భూకబ్జాదారులవైపా.. తేల్చుకోండి: నారాయణ
- పేదల ఆత్మగౌరవం కోసమే సీపీఐ పోరాటమని స్పష్టీకరణ

2 లో

రూ.6లక్షల కోట్లు
ఆవిరి

కుప్పకూలిన దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు కుప్పకూలాయి. కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలన్నట్లుగా ఓ వైపు అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లు పెంచొచ్చన్న అంచనాలు.. మరోవైపు దేశీయంగా ద్రవ్యోల్బణ భయాలు మదుపరుల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా సోమవారం ట్రేడింగ్‌లో అంతర్జాతీయ మార్కెట్లతో పాటు మన మార్కెట్లోనూ అమ్మకాలు వెల్లువెత్తాయి. దీంతో సెన్సెక్స్ 1400 పాయింట్ల మేర నష్టపోగా.. నిఫ్టీ 15,800 స్థాయిని కోల్పోయింది. మొత్తంగా మదుపరుల సంపద రూ.6 లక్షల కోట్ల మేర హరించుకుపోయింది. ఉదయం 53,184.61 వద్ద భారీ నష్టాల్లో ప్రారంభమైన బీఎస్ఈ సెన్సెక్స్.. రోజంతా అదే ధోరణి కనిపించింది. ఇంట్రాడేలో 52,527.08 వద్ద

- మిగతా 2 లో

ఇదీ లోకం!



ఈడీ ముందుకు రాహుల్‌గాంధీ

- సుదీర్ఘంగా ప్రశ్నించిన అధికారులు
- కాంగ్రెస్ నేతల ఆందోళన..అరెస్టులు
- సోనియాను కలిసి రాహుల్, ప్రియాంక

న్యూదిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సోమవారం ఈడీ విచారణకు హాజరయ్యారు. నేషనల్ హెరాల్డ్ మనీ లాండరింగ్ కేసులో దర్యాప్తు సంస్థ ఆయన్ను సుదీర్ఘంగా ప్రశ్నించింది. రాహుల్ వెంట పార్టీ సీనియర్ నేతలు, మద్దతుదారులు ఈడీ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లారు. ఉదయం 11:10 గంటలకు రాహుల్ ఈడీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. 20 నిమిషాలు ఆయనను అధికారులు ప్రశ్నించారు. మధ్యాహ్నం 2.10 గంటలకు భోజన విరామ సమయం ఇచ్చారు. తిరిగి 3.30 గంటలకు రెండోసారి విచారణకు రాహుల్ హాజరయ్యారు. మనీలాండరింగ్ నిరోధకచట్టం సెక్షన్ 50 ప్రకారం రాహుల్ వాంగ్మూలాన్ని అధికారులు నమోదు చేశారు. భోజన విరామ సమయంలో సోదరి ప్రియాంక గాంధీతో కలిసి ఈడీ కార్యాలయం నుంచి రాహుల్ వెళ్లిపోయారు. పార్టీ అధినేత్రి సోనియాగాంధీ చికిత్స పొందుతోన్న సర్ గంగరామ్ ఆసుపత్రికి

- మిగతా 2 లో

రాహుల్‌కు వెల్లువెత్తిన సంఘీభావం
కదం తొక్కిన కాంగ్రెస్ శ్రేణులు

2 లో

రైతుకు మీరేం చేశారు?

జగన్‌కు రామకృష్ణ సూటిప్రశ్న

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మూడేళ్లుగా రైతులకు ఏం మేలు చేశారో చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. పార్టీ అనంత, సత్యసాయి జిల్లాల కార్యదర్శులు జాఫర్, వేమయ్య యాదవ్, సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, కార్యదర్శివర్గ సభ్యుడు రాజారెడ్డి, శింగనమల కార్యదర్శి నారాయణస్వామితో కలిసి నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ సోమవారం మాట్లాడారు. రాష్ట్రంలో నెలకొన్న రైతు సమస్యలు, పంట నష్టాలు, సాగునీరు, ప్రాజెక్టుల నిర్మాణాలు, డ్రిప్ ఇరిగేషన్, పంటల బీమా, గిట్టుబాటు ధర, అధిక ధరలు, రైతు ఆత్మహత్యలు తదితర అంశాలతో పాటు జగన్ మూడేళ్లలో అన్నదాతలకు ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నిస్తూ లేఖ విడుదల చేశారు. అనంతపురం జిల్లాలో పంటలు నష్టపోయి కరువు కోరల్లో చిక్కుకున్న రైతాంగానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని రామకృష్ణ విమర్శించారు. 2018-19 సంవత్సరానికి రైతులకు రావాల్సిన రూ.960 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ వెంటనే ఇస్తానని అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చిన సీఎం జగన్...ఆ మాటే మర్చిపోయారని గుర్తు చేశారు. కరువు జిల్లాల్లో డ్రిప్ ఇరిగేషన్‌పై అనేక మంది రైతులు ఆధారపడి పంటలు పండిస్తున్నారని, అలాంటి వారికి డ్రిప్ కొనుగోలులో సబ్సిడీ తొలగించి అన్యాయం చేశారని మండిపడ్డారు. పండించిన పంటలను రాష్ట్ర ప్రభుత్వం కొనుకోలు చేస్తుందో లేదోనన్న అపనమ్మకంతో రైతులు ఉన్నారన్నారు. కనీస మద్దతు ధర నిర్ణయించడంలో, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందన్నారు. జిల్లా వరప్రసాదిని

- మిగతా 2 లో

సోషలిస్టు విధానాలే ప్రత్యామ్నాయం

లండన్: జీవన వ్యయ సంక్షోభ పరిష్కారానికి బ్రిటన్‌కు 'సోషలిస్ట్ విధానం' అవసరం అని కార్మికవర్గ సంస్కృతి,ప్రతిఘటన ఉత్సవం స్పష్టం చేసింది. బ్రిటన్ రాజకీయాలకు సోషలిస్టు విధానం ప్రత్యామ్నాయ మార్గంగా పేర్కొంది. 1831 మే లో చారిత్రాత్మకమైన సౌత్ వేల్స్ పట్టణంలో ఎర్ర జెండా జన్మస్థలంలో ఏర్పాటు చేయబడిన మెర్థిర్ రైజింగ్ ఫెస్టివల్ సందర్భంగా పెరుగుతున్న జీవన వ్యయ సంక్షోభాన్ని లక్ష్యంగా చేసుకుని ట్రిబ్యూన్ మ్యాగజైన్ సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశానికి వేల్స్ టీయూసీ సెక్రటరీ షావనా తాజ్, యంగ్ లేబర్ చైర్మన్ జెస్ బర్నార్డ్, ట్రిబ్యూన్ ఎడిటర్ రోనన్ బర్టెన్‌షాతో సహా పలువురు వక్తలు పాల్గొన్నారు. బ్రిటన్ రాజకీయాల్లో సోషలిస్టు విధానాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని బర్టెన్‌షా అన్నారు. బ్రిటన్‌లో టోరీలను ఓడించడానికి, సోషలిస్ట్ ప్రత్యామ్నాయంగా వర్గ-ఆధారిత రాజకీయాల నిర్మూలన సమస్యలపై చర్చించారు. ఆహార సంక్షోభం వేల్స్‌లో తలెత్తడంతో పిల్లలు ఆహారం దుకాణాలనుండి కాకుండా ఫుడ్‌బ్యాంక్ నుండి వస్తుందన్న ఊహల్లో ఉన్నారు. యువకులు తీవ్ర సంక్షోభాన్ని ఎదర్కొంటున్నారు. జెరిమీ కార్బిన్ యువకులలో బాగా ప్రాచుర్యం పొందటానికి కారణం పోరాడే స్ఫూర్తిని కలిగిఉండటమేనని ఈ సమావేశం పేర్కొంది.. 15గంటల కనీస వేతనంతో సహా నిజమైన వేతనాల పెంపుదల, సంపన్నులపై పన్ను విధించడం, దానిని పునఃపంపిణీ, పరిమితి అద్దెలు, ఆకలి, పేదరికాన్ని అంతం చేయడం, జాతీయాకరణ కనీస అవసరాలుగా పేర్కొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను రూపుమాపుదాం: డబ్ల్యుఎఫ్‌టీయూ

ఐరాస: "బాల కార్మిక వ్యవస్థను అంతం చేయండి - మనిషి దోపిడీని ఆపండి" అంటూ బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (డబ్ల్యుఎఫ్‌టీయూ) నినదించింది. చిన్నారులపై జరిగే అన్ని రకాల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాలని ప్రతినపూనింది. డబ్ల్యుఎఫ్‌టీయూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని అనుబంధ సంస్థలతో, పిల్లలపై జరిగే అన్ని రకాల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాలనే దృఢ సంకల్పానికి కట్టుబడి ఉందని పేర్కొంది. 2002లో ఐక్యరాజ్యసమితి ఈ దినోత్సవాన్ని ప్రారంభించి రెండు దశాబ్దాలు గడిచిన తర్వాత కూడా, అంతర్జాతీయ స్థాయిలో బాల కార్మిక వ్యవస్థ మరింతగా వృద్ధి చెందుతోంది. యూనిసెఫ్ తాజాగాచేపట్టిన సర్వేలో ప్రపంచవ్యాప్తంగా 160 మిలియన్ల మంది పిల్లలు- ప్రతి పదిమందిలో ఒకరు- మానసికంగా, శారీరకంగా, సామాజికంగా, నైతికంగా హానికరంగా భావించే శ్రమలో పాలుపంచుకుంటున్నారనే భయంకరమైన వాస్తవాన్ని వెల్లడి చేసింది. 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు నీటి అడుగున మైనింగ్, హెవీ లిఫ్టింగ్, ప్రమాదకరమైన ఫ్యాక్టరీ యంత్రాల నిర్వహణలో, వ్యవసాయ రంగాల్లో ఉన్నారు, మిలియన్ల మంది శారీరక, మానసిక ఆరోగ్యానికి ప్రమాదాన్ని కలిగించే ఉద్యోగాలలో బానిసత్వంలో మగ్గుతున్నారు. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్‌ఓ) ప్రకారం ప్రతి సంవత్సరం 22 వేల మంది కార్మికరంగంలో ఉన్న పిల్లలు

మరణిస్తున్నారని తెలిపింది. గత రెండేళ్లలో ప్రపంచంలో బాల కార్మిక వ్యవస్థ తారాస్థాయికి చేరింది.. 2016-2020 మధ్య ప్రపంచవ్యాప్తంగా పని చేసే పిల్లల సంఖ్య పెరిగింది. కోవిడ్-19 మహమ్మారి ఆర్థిక ప్రభావం పిల్లలను బాల కార్మికులుగా నెట్టివేసింది. పెరుగుతున్న పేదరికం, పాఠశాలల మూసివేత, పెరిగిన ఆహార అభద్రత వల్ల రాబోయే సంవత్సరాల్లో లక్షలాది మంది పిల్లలు పని చేయవలసి వస్తుంది. బాల కార్మికులకు వ్యతిరేకంగా ఈ అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా, డబ్ల్యుఎఫ్‌టీయూ దోపిడీ ఆర్థిక వ్యవస్థను అంతం చేయడానికి, సామ్యవాద సమాజాన్ని తీసుకురావడానికి పోరాడతానని ప్రతిజ్ఞ చేసింది.

విపక్షాల రాష్ట్రపతి అభ్యర్థి పవార్?

(మొదటి పేజీ తరువాయి)

పోషించిన అపార అనుభవం ఆయనకు ఉంది. మహారాష్ట్రలో సైద్ధాంతిక వైరుధ్యాలు కలిగిన శివసేన, ఎన్సీపీ, కాంగ్రెస్‌లను బీజేపీకి వ్యతిరేకంగా ఏకతాటి పైకి తీసుకొచ్చి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. మరోవైపు, రాష్ట్రపతి ఎన్నికను ఏకగ్రీవం చేయాలని బీజేపీ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఇందుకోసం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లను రంగంలోకి దించింది. అన్ని పార్టీలతో చర్చించి ఏకాభిప్రాయ సాధన దిశగా చర్చలు జరపాలని సూచించింది. 2017 రాష్ట్రపతి ఎన్నికల్లోనూ ఏకాభిప్రాయం కోసం బీజేపీ రాజ్‌నాథ్‌సింగ్, వెంకయ్యనాయుడును నియమించింది. ఆ తర్వాత వెంకయ్యనాయుడునే ఎన్డీయే తరఫున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా బరిలో దించిన విషయం తెలిసిందే. అధికార పార్టీ నుంచి అనేకమంది పేర్లు ప్రచారంలో ఉన్నప్పటికీ..బీజేపీ అధికారికంగా ప్రకటించలేదు.

రూ.6లక్షల కోట్లు ఆవిరి

(మొదటి పేజీ తరువాయి)

దాదాపు 1,800 పాయింట్ల మేర కోల్పోయిన సూచీ.. చివరికి 1,456.74 పాయింట్ల నష్టంతో 52,846.70 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 427.40 పాయింట్ల నష్టంతో 15,774.40 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 షేర్లలో ఒక్క నెస్లే ఇండియా షేర్లు మాత్రమే స్వల్పంగా లాభపడ్డాయి. మిగిలిన షేర్లన్నీ నష్టపోయాయి. నిఫ్టీ 50లో సైతం నెస్లే ఇండియా, బజాజ్ ఆటో షేర్లు స్వల్ప లాభాలను చవిచూశాయి. అన్ని రంగాల షేర్లు నష్టాల్లోనే ముగిశాయి. సోమవారం ట్రేడింగ్ రూ.6 లక్షల కోట్ల మేర మదుపరుల సంపద హరించుకుపోయింది. శుక్రవారం నాటికి బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.251.84 లక్షల కోట్లు ఉండగా.. సోమవారం నాడు ఆ మొత్తం 245.33 లక్షల కోట్లకు చేరింది.

పతనానికి కారణాలివే..

అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ పెంపు నిర్ణయం (జూన్ 14-15) తీసుకోనుందనే వార్తలు దేశీయ మార్కెట్ల పతనానికి ప్రధాన కారణమయ్యాయి. మే నెలలో ఆ దేశ ద్రవ్యోల్బణం 40 ఏళ్ల గరిష్ఠానికి (8.6 శాతం) చేరింది. దీంతో ద్రవ్యోల్బణం కట్టడికి ఫెడ్ 50 బేసిస్ పాయింట్ల మేర వడ్డీని పెంచే అవకాశం ఉందని తొలుత వార్తలు వచ్చినప్పటికీ.. మరింత దూకుడుగా వ్యవహరించి 75 బేసిస్ పాయింట్లు కూడా పెంచే అవకాశం లేకపోలేదన్న అంచనాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. మరోవైపు దేశీయంగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం సైతం మదుపరులను కలవరపెట్టింది. ఏప్రిల్‌లో వినియోగ ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 7.7 శాతంగా నమోదైంది. మే నెలకు సంబంధించిన రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు సోమవారం విడుదల కానున్న నేపథ్యంలో మదుపరులు అప్రమత్తత పాటించినట్లు తెలుస్తోంది. దేశీయంగా రూపాయి బలహీన పడడం దలాల్‌స్ట్రీట్‌లో అమ్మకాలకు మరో కారణం. డాలరుతో రూపాయి మారకం విలువ సోమవారం మార్కెట్ ముగిసే సమయానికి 78.05గా ఉంది. రోజురోజుకూ రూపాయి బలహీన పడుతుండడం విదేశీ మదుపరులు దేశీయ స్టాక్స్‌పై ఆసక్తి చూపడం లేదు. కొద్ది నెలలుగా అమ్మకాలకు దిగిన విదేశీ సంస్థాగత మదుపరులు బలహీన రూపాయి విలువ కారణంగా తమ సంపదను తరలిస్తున్నారు. వీటితో పాటు అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు గరిష్ఠ స్థాయికి చేరడం, చైనాలో కొవిడ్ కేసులు పెరుగుదల నేపథ్యంలో ఆ దేశ ఆర్థిక వ్యవస్థపై అనుమానాలు రేకెత్తడం వంటి ఇతర కారణాలతో మన సూచీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి.

రైతుకు మీరేం చేశారు?

(మొదటి పేజీ తరువాయి)

హంద్రీనీవా ప్రాజెక్టు సామర్థ్యం 6 వేల క్యూసెక్కులకు పెంచడంతో పాటు మొత్త పదివేల క్యూసెక్కుల నీటిని అందిస్తామని చెప్పిన జగన్...మూడేళ్లయినా ఒక్క పిల్ల కాలువ తవ్వలేకపోయారని తూర్పారబట్టారు. హంద్రీనీవా ప్రాజెక్టు పనులు పూర్తిగా పడకేశాయని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు మరమ్మతులు చేయకపోవడంతోనే పులిచింతల ప్రాజెక్టులో గేటు, పింఛా, అన్నమయ్య ప్రాజెక్టులు కొట్టుకుపోయాయని వివరించారు. రాష్ట్రంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా తాగు, సాగునీరు అందించడమే కాకుండా 960 విద్యుత్ మెగావాట్ల ఉత్పత్తికి అవకాశమున్న పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, అయినా ముఖ్యమంత్రి ఏమీ మాట్లాడలేని స్థితిలో ఉన్నారని నిప్పులు చెరిగారు. పోలవరాన్ని గాలికి వదిలేయడమే కాకుండా అమరావతిని నాశనం చేశారని ఆరోపించారు.

ఆరోగ్యశ్రీలోకి మరిన్ని...

(మొదటి పేజీ తరువాయి)

త్వరగా పూర్తిచేసుకోవాలన్నారు. ఇవి పూర్తయితే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ విధానం సమర్థంగా అమలు జరుగుతుందని, క్యాన్సర్ గుర్తింపు అన్నది సులభమవుతుందని, ఈలోగా సిబ్బందికి క్యాన్సర్ స్క్రీనింగ్‌పై శిక్షణ ఇప్పించాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని, సీఎస్ సమీర్ శర్మ, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం టీ కృష్ణబాబు, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి (కోవిడ్ మేనేజ్‌మెంట్ అండ్ వాక్సినేషన్) ముద్దాడ రవిచంద్ర, ఆరోగ్యశాఖ స్పెషల్ సెక్రటరీ జీఎస్ నవీన్ కుమార్, ఆరోగ్యశ్రీ సీఈఓ వి.వినయ్ చంద్, ఏపీఎంఎస్ఐడీసీ వీసీ అండ్ ఎండీ డీ మురళీధర్ రెడ్డి, ఏపీవీవీపీ కమిషనర్ వీ వినోద్ కుమార్, వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ (డ్రగ్స్) రవిశంకర్ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

ఏరువాక హడావుడేది?

(మొదటి పేజీ తరువాయి)

పంటల సాగు నిమిత్తం రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు సిద్ధంగా ఉంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వర్షాలు ఆలస్యమైనా రిజర్వాయర్లలో నీటి నిల్వలుండడం కొంత ఆశాజనకమే అయినప్పటికీ, వాతావరణం కూడా సహకరిస్తేనే అదునుకు పంటలు సాగుచేసే అవకాశముంటుందని రైతులు చెబుతున్నారు.

తగ్గిన బంగారం, వెండి ధరలు

న్యూదిల్లీ: దేశ వ్యాప్తంగా బంగారం వెండి ధరలు తగ్గాయి. అంతర్జాతీయంగా నెలకొన్న వివిధ పరిస్థితుల కారణంగా ఆదివారం దేశ రాజధాని దిల్లీలో రూ.51,591 గా ఉన్న 10 గ్రాముల మేలిమి బంగారం ధర సోమవారం నాటికి రూ.321 తగ్గి రూ.51,270కి చేరుకుంది. ఇక వెండి ధరలు కూడా ఇదే తరహాలో తగ్గాయి. ఆదివారం రూ.61,619 గా ఉన్న కిలో వెండి ఏకంగా రూ.874 తగ్గి రూ.60,745కి చేరుకుంది. ఇక అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 1,858 డాలర్లు, ఔన్సు వెండి ధర 21.54 డాలర్ల వద్ద ట్రేడవుతున్నట్టు సూచీలు వెల్లడించాయి. కామెక్స్ ట్రేడింగ్‌లో స్పాట్‌గోల్డ్ ధరలు 0.70 శాతం తగ్గడం, డాలర్ బలపడడంతోనే ధరలు తగ్గినట్టు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్‌లో పని చేస్తున్న సీనియర్ విశ్లేషకులు తపన్ పటేల్ తెలిపారు.

ఇళ్లకోసం రోడ్డెక్కిన పేదలు

విశాలాంధ్ర-హన్మకొండ: ఇళ్ల స్థలాల కోసం పోరాడుతున్న పేదల వైపో.. భూకబ్జాలకు పాల్పడుతున్న భూమాఫియా వైపో ప్రభుత్వం తేల్చుకోవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ అన్నారు. సోమవారం హన్మకొండలో చలో కలెక్టరేట్‌కు సీపీఐ ఆధ్వర్యంలో పేదలు, గుడిసెవాసులు భారీగా తరలివచ్చారు. వరంగల్, హన్మకొండ జిల్లాల పరిధిలో ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసుకున్న పేదలు వేలాది మంది హన్మకొండలోని ఏకశిలా పార్కుకు తరలివచ్చి రోడ్డు పై బైఠాయించి భారీ ధర్నా నిర్వహించారు. ధర్నాకు వేలాదిగా తరలి రావడంతో హన్మకొండ బస్టాండ్ నుంచి నక్కలగుట్ట కాళోజీ సెంటర్ వరకు రోడ్డు కిక్కిరిసి పోయింది. అనంతరం ఏకశిలా పార్కు నుంచి వరంగల్, హన్మకొండ కలెక్టరేట్‌ల ముట్టడికి ర్యాలీగా బయలుదేరిన గుడిసెవాసులు, సీపీఐ నాయకులు, కార్యకర్తలు కాళోజీ సెంటర్‌కు చేరుకోగానే పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, సీపీఐ నాయకులకు మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం కలెక్టర్లకు వినతిపత్రం అందించేందుకు నాయకులను మాత్రమే అనుమతి ఇస్తామని పోలీసులు చెప్పడంతో వరంగల్, హన్మకొండ జిల్లాల కలెక్టర్‌లకు నారాయణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు నేతృత్వంలో సీపీఐ నాయకులు వినతిపత్రాలు అందజేశారు. కార్యకర్తలనుద్దేశించి నారాయణ మాట్లాడుతూ, వరంగల్ నగరంలో పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని, డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామన్న సీఎం కేసీఆర్ తన హామీని నిలబెట్టుకోలేదన్నారు. ముఖ్యమంత్రి అయిన వెంటనే కేసీఆర్ వరంగల్ పర్యటనకు వచ్చి సీపీఐ గుడిసెలు వేయించిన కాలనీలు తిరిగి మీకు అందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని, గుడిసెలు లేని నగరంగా వరంగల్ ను మారుస్తామని చెప్పారని, ఎనిమిదేళ్లు గడిచినా హామి నిలబెట్టుకోలేదన్నారు. పేదలను ఆత్మ గౌరవంతో నిలబెట్టడం కోసమే సీపీఐ భూ పోరాటాలకు పిలుపునిచ్చిందని చెప్పారు. ప్రభుత్వ భూములన్నీ అన్యాక్రాంతం అవుతుంటే వాటి పరిరక్షణ కోసం నిలువనీడలేని పేదలే ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని అన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి వుంటే ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం భూకబ్జాదారుల వైపు నిలబడితే తాము చాకలి ఐలమ్మ స్ఫూర్తితో పేదల తరఫున తుపాకులు పట్టుకొని పోరాడేందుకు కూడా సిద్ధమని నారాయణ స్పష్టం చేశారు. పేదలు ఉంటే భూములపైనా, లేదంటే జైళ్లలో ఉండేందుకైనా సిద్ధమని అన్నారు. ఇళ్ల స్థలాలు పేదలకు దక్కే వరకూ ఈ పోరాటాన్ని ఆపేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నేదునూరి జ్యోతి, హన్మకొండ, వరంగల్ జిల్లాల కార్యదర్శులు కర్రె భిక్షపతి, మేకల రవి, రాష్ట్ర నాయకులు పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, ఎస్ కే బాష్మియా, పనాస ప్రసాద్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీ వుల్లా ఖాద్రి, జిల్లా కార్యవర్గ సభ్యులు మద్దెల ఎల్లేష్, బుస్సా రవీందర్, మండ సదాలక్ష్మి, దండు లక్ష్మణ్, ఆదరి శ్రీనివాస్, ఉట్కూరి రాములు,కర్రె లక్ష్మణ్, గన్నారపు రమేష్, సంగతి ఎలేందర్, మునిగాల భిక్షపతి, గిన్నారపు రోహిత్, కొట్టెపాక రవి, గుండె బద్రి, జన్ను రవి, మాలోతు శంకర్, అక్బర్, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాగ్‌రాజ్ కూల్చివేతలపై మాయావతి ధ్వజం

లక్నో: ప్రయాగ్‌రాజ్ హింసకు కారణమని భావిస్తున్న నిందితుల ఇళ్లను కుల్చివేసి రాష్ట్రంలో భయానక వాతావరణం సృష్టించారని యూపీ ప్రభుత్వంపై బీఎస్పీ అధినేత్రి మాయావతి ఆగ్రహం వ్యక్తం చేశారు. మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసి దేశ వ్యాప్తంగా నిరసనలకు కారణమైన బీజేపీ నేతలు నూపుర్ శర్మ, నవీన్ కుమార్ జిందాల్‌లను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండు చేస్తూ వరుస ట్వీట్లు చేశారు. వారి నోటి దురుసు కారణంగానే ప్రపంచ వ్యాప్తంగా దేశం పరువు పోయిందని పేర్కొన్నారు. నిందితులు వారైతే ఇప్పటికీ వారిపై చర్యలు తీసుకోకపోవడం వెనుక ప్రభుత్వ వైఖరి తెలుస్తోందని పేర్కొన్నారు. నిర్దుష్టమైన వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని కూల్చివేతల పర్వానికి తెరలేపారని ఆరోపించారు. నిబంధనలను అతిక్రమించి ప్రభుత్వమే చేపట్టిన ఈ తరహా చర్యలతో అమాయకుల కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది దారుణమైన చర్య అని పేర్కొన్నారు. ఇళ్లను కూల్చివేయడాన్ని కోర్టులు గమనించాలని కోరారు.

చట్టం నిద్ర పోతోంది: కపిల్ సిబల్

దేశంలో చట్టం నిద్ర పోతోందని రాజ్యసభ ఎంపీ, సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వ్యాఖ్యానించారు. ఈ కారణంగానే కూల్చివేతల సంస్కృతి పెరిగిందని వ్యాఖ్యానించారు. మహ్మమ్మద్ ప్రవక్తపై బీజేపీ నేతలు చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో శుక్రవారం చోటు చేసుకున్న హింసాకాండకు కారణమని భావిస్తున్న ఇద్దరు నిందితుల భవనాలను కూల్చివేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబడుతూ ట్వీట్ చేశారు. చట్టం నిద్రపోతున్నప్పుడే కూల్చివేతల సంస్కృతి వృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఇదేనా మారుతున్న దేశం అంటూ ప్రభుత్వానికి చురకలంటించారు.

ఈడీ ముందుకు రాహుల్‌గాంధీ

(మొదటి పేజీ తరువాయి)

చేరుకున్నారు. సోనియా ఇటీవల కోవిడ్ బారినపడిన సంగతి తెలిసిందే. కరోనా తదనంతర సమస్యలతో ఆమె ఆసుపత్రిలో చేరారు. సోనియాను కలిసిన వెంటనే మరో దఫా విచారణ కోసం ఈడీ కార్యాలయానికి వచ్చారు. రాహుల్ వెంట ప్రియాంక సహా అశోక్ గెహ్లాట్, భూపేశ్ బాఘెల్, పి.చిదంబరం, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. నేషనల్ హెరాల్డ్ న్యూస్ పేపర్‌లో పెట్టుబడులు, ఆర్థిక అవకతవకలపై రాహుల్‌ను అధికారులు ప్రశ్నించినట్లు తెలుస్తోంది.

రాహుల్‌గాంధీ ఈడీ విచారణకు వెళ్తోన్న సమయంలో కాంగ్రెస్ నేతలు దేశవ్యాప్త నిరసనలకు దిగారు. నేతల నుంచి లభించిన మద్దతు మధ్య రాహుల్ ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. ప్రియాంకగాంధీ రాహుల్ పక్కనే ఉండి చూసుకున్నారు. ఎంటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా నిరసనకారుల్ని పోలీసులు ఎక్కడికక్కడే నిలువరించారు. రణ్‌దీప్ సూర్జేవాలా, హరీశ్ రావత్ వంటి సీనియర్ నేతలను అదుపులోకి తీసుకున్నారు. మరోపక్క సోనియా ఇదే కేసులో ఈ నెల 23న ఈడీ ముందు హాజరు కావాల్సి ఉంది.

రాహుల్‌గాంధీపై కేంద్రం తీసుకుంటున్న చర్యలను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నిరసనలు చేపట్టింది. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. దిల్లీలో నిరసన వ్యక్తం చేస్తున్న పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, హరీశ్ రావత్ సహా అనేకమంది నేతలను తుగ్లక్ రోడ్డు పోలీసుస్టేషన్‌కు తరలించగా.. వారిని కలిసేందుకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వాద్రా స్టేషన్‌కు వెళ్లారు. ఆమె రాకతో పోలీసుస్టేషన్ వద్ద ఉద్రిక్త వాతావరణం ఏర్పడినప్పటికీ.. చివరకు ప్రియాంకను లోపలికి అనుమతించారు. వేణుగోపాల్ సహా నేతలను కలిసిన ప్రియాంక వారితోపాటు కొద్దిసేపు స్టేషన్‌లోనే కూర్చుని నిరసన తెలిపారు. పోలీసులు అరెస్టు చేసినవారిలో రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ కూడా ఉన్నారు. ఆయన్ను మరో పోలీసస్టేషన్‌కు తరలించారు. తనతోపాటు పార్టీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని బస్సుల్లో తరలిస్తున్న ఫొటోలు, వీడియోలను గెహ్లాట్ తన ట్విటర్ ఖాతాలో పంచుకున్నారు. పోలీసుల వైఖరి దారుణంగా ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రధాన నేతలు మల్లికార్జున ఖర్గే, జైరామ్ రమేశ్, దిగ్విజయ్ సింగ్, ముకుల్ వాస్నిక్, దీపేందర్ హుడా తదితర నేతలను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు.

ఎమ్మెల్యేగా ధామీ ప్రమాణం

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి ఎమ్మెల్యేగా అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నెల 3న జరిగిన చంపావత్ అసెంబ్లీ ఉపఎన్నికల్లో 55 వేల రికార్డు మెజారిటీతో గెలుపొందిన ఆయన చేత అసెంబ్లీ స్పీకర్ రీతూ ఖండూరి సోమవారం ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ కుటుంబం నుంచి వచ్చిన తనపై రాష్ట్ర ప్రజలు చూపిన ప్రేమకు కృతజ్ఞత తెలిపారు. సీఎంగా రాష్ట్రానికి సేవ చేసే అవకాశం కల్పించిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు చెప్పారు. నేడు తనతో పాటు రాష్ట్ర అభివృద్ధిని కోరుకునేవారంతా ప్రమాణం చేసినట్టు భావిస్తున్నానని పేర్కొన్నారు. సీఎంగా 2025 నాటికి రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడంపై దృష్టి సారించనున్నట్టు పేర్కొన్నారు. ఇది తన వ్యక్తిగతమైన అంశం కాదని అందరి సహకారంతోనే సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధి సమిష్టి బాధ్యత అని, ఆ లక్ష్యం దిశగా అడుగులు వేద్దామని పిలుపు నిచ్చారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నిటినీ నెరవేరుస్తామని పేర్కొన్నారు. మంత్రివర్గ తొలి సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు యూనిఫాం సివిల్ కోడ్ కోసం సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి రంజనా దేశాయ్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు.

లోయలో పని చేయలేం

కశ్మీరీ పండితుల ఆందోళన

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లో శాంతిని పునరుద్ధరించే వరకూ తమను లోయ నుంచి ఇతర ప్రాంతాలకు తరలించాలని కాశ్మీరీ పండిత్ వర్గాలకు చెందిన ఉద్యోగులు డిమాండు చేశారు. ఈ మేరకు సోమవారం జమ్మూలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆల్ మైగ్రెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కశ్మీర్ అనే బ్యానర్‌తో వందలాది మంది ఉద్యోగులు జమ్మూలోని ప్రెస్‌క్లబ్ ఎదుట సమావేశం నిర్వహించారు. మా రక్తాన్ని పణంగా పెట్టవద్దు, లోయనుంచి తరలించడమే ఏకైక పరిష్కారం, మా పిల్లల్ని అనాథలు కానివ్వకండి అంటూ రూపొందించిన ప్లకార్డులను ప్రదర్శించారు. లోయలో శాంతిని పునరుద్ధరించే వరకు తమను అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తరలించాలని డిమాండు చేశారు. ప్రధానమంత్రి ఉపాధి పథకం కింద ఎంపికైన వేల మంది కశ్మీరీ పండితులు లోయలో పని చేస్తున్నారని పేర్కొన్నారు. నిరసన కార్యక్రమంలో పాల్గొన్న శ్వేతా భట్ మాట్లాడుతూ తాము లోయలో సురక్షితంగా లేమని వాపోయారు. తాను నిత్యం ఫీల్డ్ వర్క్‌లో ఉండాల్సిన అవసరముందని, అయితే ఉగ్రవాదుల దాడుల కారణంగా భయపడుతున్నట్టు పేర్కొన్నారు. తమ ప్రాణాలు ప్రమాదంలో పడ్డాయని వాపోయారు. ప్రభుత్వం తమను లోయలోని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని ఇచ్చిన హామీని తిరస్కరిస్తున్నట్టు చెప్పారు. లోయ నుంచి బయటి ప్రాంతాలకు తరలించాలని గత నెల రోజులుగా తాము ఆందోళన నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

రాహుల్‌కు వెల్లువెత్తిన సంఘీభావం

- దిల్లీలో పాదయాత్రను అడ్డుకున్న పోలీసులు
- పెద్ద సంఖ్యలో అరెస్టులు
- ఖాకీల తీరుపై ప్రియాంక ఆగ్రహం

న్యూదిల్లీ: నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ విచారణకు హాజరైన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి సంఘీభావంగా సోమవారం దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నిరసనలు చేపట్టింది. ఇందులో భాగంగా దిల్లీలోని కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం ఏఐసీసీ ఆఫీసు నుంచి రాహుల్, ప్రియాంక ఇద్దరూ భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ నేతలతో కలిసి ఈడీ ఆఫీసుకు బయలుదేరి వెళ్లారు. రాహుల్ పిలుపు మేరకు ఏఐసీసీ ఆఫీసుకు భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ నేతల్ని అడ్డుకునేందుకు పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. అయినా వారు బారికేడ్లు దూకి మరీ ర్యాలీకి వెళ్లారు. ఎండ వేడిని లెక్కచేయకుండా ఏఐసీసీ ఆఫీసు నుంచి పాదయాత్రగా బయలుదేరిన కాంగ్రెస్ కార్యకర్తల్ని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో అనేక చోట్ల ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. పోలీసులు అనేకమంది సీనియర్ నాయకులను, కార్యకర్తలను నిర్బంధించి పోలీసు వ్యాన్‌లు మరియు బస్సుల్లో తీసుకెళ్లారు.

కాగా పోలీసుల నుంచి తప్పించుకుని అనేకమంది కార్యకర్తలు రాహుల్ తో పాటు ర్యాలీగా ఈడీ ఆఫీసు వరకూ వెళ్లారు. ఈ సందర్భంగా కొంతమంది కార్యకర్తలు గాయపడినట్లు సమాచారం. ఈ సందర్భంగా 'ఇంక్విలాబ్ జిందాబాద్', 'రాహుల్ తుమ్ సంఘర్ష్ కరో హమ్ తుమ్హారే సాథ్ హై (రాహుల్ మీరు పోరాడండి, మేము మీతో ఉన్నాము)' అన్న నినాదాలు మిన్నంటాయి. 'సత్యమేవ్ జయతే' (సత్యమే గెలుస్తుంది) వంటి నినాదాలు రాసి ఉన్న ప్లకార్డులను ఊపుతూ సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాదయాత్రలో పాల్గొన్నారు. తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నడుమ కాంగ్రెస్ నేతలను ఆ పార్టీ కార్యాలయానికే తరలించిన పోలీసులు... రాహుల్ గాంధీని మాత్రం పోలీసు వాహనంలోనే ఈడీ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా ఈడీ అధికారులు, పోలీసుల తీరుపై ప్రియాంకా గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. తన సోదరుడు రాహుల్ గాంధీ అంటే ఏమిటన్న విషయాన్ని కూడా ఆమె ఆసక్తికరంగా చెప్పారు. దేనికీ తలొగ్గని సత్యాన్నే రాహుల్ గాంధీ అంటారంటూ ఆమె వ్యాఖ్యానించారు. పోలీసు బారికేడ్లు, ఈడీ బెదిరింపులు, లాఠీలు, నీటి ఫిరంగులు... ఇలా దేనికీ రాహుల్ గాంధీ తలొగ్గరని ఆమె చెప్పారు. తొలుత కాంగ్రెస్ పిలుపునిచ్చిన 'సత్యాగ్రహ కవాతు'లో చేరేందుకు భారీ సంఖ్యలో కార్య కర్తలు జాతీయ, పార్టీ జెండాలను పట్టుకుని ఉదయం 9 గంటలకే పార్టీ దిల్లీలోని ప్రధాన కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యాలయం నుంచి ఈడీ కార్యాలయం దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. చెప్పులు తెగపోయిన ఓ కార్యకర్త ఈ సందర్భంగా మాట్లాడుతూ... 'నా కాళ్లపై బొబ్బలు వచ్చాయి. కానీ రాహుల్ గాంధీ మా అభిమాన నాయకుడు కాబట్టి పాదయాత్ర కొనసాగిస్తా' అని అన్నారు. ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకునేందుకు కేంద్రం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని పేర్కొంటూ సీబీఐ, ఈడీ అని రాసి ఉన్న పోస్టర్‌ను ఉంచిన చిన్న బోనును పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేశారు. 'ఈడీ, సీబీఐలు బీజేపీ బోనులో ఉన్నాయని చూపించే ప్రయత్నం చేశాం. దర్యాప్తు సంస్థలు ఇకపై స్వయంప్రతిపత్తి కలిగి ఉండవు. బీజేపీకి చిలుకలుగా మారాయి' అని ఓ కార్యకర్త అన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో తమ నేతలపై అభియోగాలు నిరాధారమైనవని పేర్కొంటూ, మోదీ ప్రభుత్వం రాజకీయ ప్రతీకారంతో వ్యవహరిస్తోందని ఆరోపించిన కాంగ్రెస్... ఈ మార్చ్‌ను మహాత్మా గాంధీ సత్యాగ్రహ(శాంతియుత ప్రతిఘటన)కి నాందిగా అభివర్ణించింది.

అరెస్టులకు సూర్జేవాలా ఖండన

దిల్లీలో కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను పోలీసులు నిర్బంధించడాన్ని కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి రణదీప్ సూర్జేవాలా ఖండించారు. మోదీ ప్రభుత్వాన్ని బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో పోల్చారు. పోలీసులు అడుగడుగున బారికేడ్లు పెట్టడంతో రాహుల్ గాంధీ ఈడీ కార్యాలయానికి చేరుకోవడానికి అడ్డదారిలో వెళ్లారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బాఘేల్, కేసీ వేణుగోపాల్, లోక్‌సభలో కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదరి ఉన్నారు.

పోలీసులపై ప్రియాంక ఫైర్

ఈడీ కార్యాలయం ముందు నిరసనకు దిగిన పార్టీ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు ఆయనను తుగ్లక్ రోడ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ సందర్భంగా ఆయనను పోలీసులు దాదాపుగా ఈడ్చుకెళ్లినట్లుగా తీసుకెళ్లారు. ఈ పెనుగులాటలో ఆయన చొక్కా చిరిగిపోయింది. పోలీసుల తీరుపై కేసీ వేణుగోపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో అరెస్ట్ చేసిన నేతలను విడుదల చేస్తున్నట్లు పోలీసులు ప్రకటించినా... పోలీసుల వైఖరిని నిరసిస్తూ వేణుగోపాల్ పీఎస్‌లోనే దీక్షకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ నేరుగా తుగ్లక్ రోడ్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. చొక్కా చిరిగిన స్థితిలో కనిపించిన వేణుగోపాల్‌ను చూసిన ప్రియాంకా గాంధీ పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీనియర్ రాజకీయవేత్తలతో వ్యవహరించేది ఇలాగేనా? అంటూ ఆమె పోలీసులపై మండిపడ్డారు. మధ్యప్రదేశ్, అసోం, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కేరళ, తెలంగాణలో కాంగ్రెస్ కార్యకర్తలు నిరసనలు తెలిపారు..

విద్య కాషాయీకరణకు కేంద్రం కుట్ర

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు

నిరసనలో జాన్సన్‌బాబు, ఓబులేశు, సాయికుమార్, చరణ్ తదితరులు

విశాలాంధ్ర-విజయవాడ : నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్య కాషాయీకరణ, ప్రైవేటీకరణకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నిందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు విమర్శించారు. నూతన జాతీయ విద్యావిధానం, జీవో నంబర్ -117ను రద్దు చేయాలని డిమాండు చేస్తూ ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి పిలుపు మేరకు విజయవాడ లెనిన్ సెంటర్‌లో సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జాన్సన్‌బాబు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పాఠశాల విద్యలో ఆర్‌ఎస్‌ఎస్ అజెండాను జొప్పించి విద్యార్థుల ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేయాలని ప్రయత్నిస్తోందన్నారు. విద్యారంగంలో సంస్కరణల కోసం గతంలో కొఠారి కమిషన్, రాధాకృష్ణన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయకుండా బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌కు అనుకూలంగా వ్యవహరించే కస్తూరి రంగన్ నేతృత్వంలో నూతన జాతీయ విద్యా విధానాన్ని రూపొందించిందని చెప్పారు. స్వాతంత్ర్య కోసం తమ ప్రాణాలను వదిలిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల చరిత్రను పాఠ్యపుస్తకాల నుంచి తొలగించి మూఢనమ్మకాలైన జ్యోతిష్యం, వాస్తు శాస్త్రాలను చేర్చడం సిగ్గుచేటన్నారు. లౌకిక వ్యవస్థకు తూట్లు పొడిచేలా రూపొందించిన నూతన జాతీయ విద్యావిధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండు చేశారు. నూతన విద్యావిధానం పేరుతో ఏపీలో తెలుగు మీడియం స్థానంలో పూర్తిగా ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశపెట్టడం మంచిది కాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు వల్ల ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీనవర్గాలకు విద్య అందని ద్రాక్షగా మారుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో పాఠశాలల విలీనంతో బాలికలు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్రంలో 64వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, పాఠశాలల విలీనంతో ఆ పోస్టులు భర్తీ చేసే అవకాశం లేక నిరుద్యోగం మరింత పెరుగు తుందన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థల ఎదుగుదలకు అనుకూలంగా ఉన్న నూతన విద్యా విధానాన్ని, దానికి అనుగుణంగా ఇటీవల జారీ చేసిన జీవో నంబర్ 117ను రద్దు చేయాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులేశు, నగర ప్రధాన కార్యదర్శి ఎం.సాయికుమార్, నాయకులు చరణ్, అయ్యప్ప, విష్ణు, సాయిచరణ్, శశికుమార్, ఆర్.సాయికుమార్ పాల్గొన్నారు.

ఫ్యాక్టరీలు నిర్మించని కంపెనీలపై చర్యలు తీసుకోవాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

మాట్లాడుతున్న ముప్పాళ్ల. వేదికపై రమణారెడ్డి, మారుతీ వరప్రసాద్, రాంబాబు, హుస్సేన్, శాంతి తదితరులు

విశాలాంధ్ర-దాచేపల్లి: పల్నాడు జిల్లాలో రైతు కుటుంబాలకు ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికి పొలాలు తీసుకున్న కంపెనీలపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పొలాలు ఇచ్చిన రైతు కుటుంబానికి రూ.24 వేలు ఇవ్వాలన్నారు. సోమవారం జరిగిన సీపీఐ గురజాల నియోజకవర్గ 8వ మహాసభలకు ముఖ్యఅతిథిగా ముప్పాళ్ల విచ్చేశారు. ఈ మహాసభకు మందపాటి రమణారెడ్డి అధ్యక్షత వహించారు. ముప్పాళ్ల మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్, గ్యాస్ పెరుగుదలతో పేదల బ్రతుకు భారమైందని, దానివల్ల నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలకు అడ్డుఅదుపు లేకుండా పోయిందన్నారు. కానీ ప్రజల కూలి మాత్రం పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ప్రతి పేద వాడికి రూ.500లకు గ్యాస్ సిలిండర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తోందని, మత హింసను ప్రేరేపిస్తోందని చెప్పారు. సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతివరప్రసాద్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం చేసిన రైతు చట్టాల వలన రైతులకు ఏమాత్రం మేలు జరగదని గ్రహించిన వారు సంవత్సరం పాటు రోడ్ల మీద ఉద్యమాలు చేసి ప్రభుత్వం మెడలు వంచి రైతు చట్టాలను వెనక్కి తీసుకొనేలా చేశారని గుర్తుచేశారు. అన్ని రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోలు, డీజిల్ ధరలు ఎక్కువ అని, ఇకనైనా సర్‌ఛార్జీలు తగ్గించి పెట్రోల్ ధరలు తగ్గించాలని అన్నారు. పల్నాడు జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శులు కాసా రాంబాబు, షేక్ హుస్సేన్, సీపీఐ సీనియర్ నాయకులు తెల నాకుల సత్యన్నారాయణ, బుర్రి కృష్ణారెడ్డి, కొమెరా వెంకట్రావు, ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు లంకా శాంతి, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ, ఏఐటీయూసీ నాయకులు వేముల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మిత్రదీప్'కు బ్రిలియన్ అవార్డు

అధినేత సందీప్‌కు సోషల్ వర్కర్ ఆఫ్ ది ఇయర్‌గా గుర్తింపు

విశాలాంధ్ర-లింగపాలెం: కరోనా రోగులకు ఉచితంగా ఆక్సిజన్ అందించడం, వారి కుటుంబాలకు ఆసరాగా ఉండటం వంటి కార్యక్ర మాలతో సమాజ సేవ చేస్తున్న 'మిత్రదీప్' స్వచ్ఛంద సంస్థ సేవలను గుర్తించి 2022లో ఏపీ నుంచి ఈ సంస్థకు సోషల్ వర్కర్ ఆఫ్ ద ఇయర్ అవార్డును అందించారు. భారత్‌కు చెందిన ఐకాన్ ఫౌండేషన్ నిర్వహించిన అంతర్జాతీయ బ్రిలియన్ అవార్డుల్లో భాగంగా మిత్రదీప్ సంస్థ అధినేత సొంగా సందీప్‌కు గోవాలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును అందజేశారు. దేశ వ్యాప్తంగా ఈ అవార్డులను 75 మందికి ఇవ్వగా, ఆంధ్రప్రదేశ్ నుంచి ఏలూరు జిల్లా ధర్మాజీగూడేనికి చెందిన సందీప్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ప్రముఖ వైద్యులు, యువ పారిశ్రామిక వేత్తలు, సామాజిక స్పృహ ఉన్న ఫౌండేషన్లు, స్వచ్ఛంద సేవా సంస్థల సేవలను గుర్తించి వారిని ఎంపిక చేశారు. ప్రముఖ విద్యావేత్త, పారిశ్రామిక వేత్త సంజయ్ బాధవత్, మహారాష్ట్ర సినీ నటుడు సురేందర్ పాల్ సింఘ్, హైపడ్జ్ మీడియా సంస్థకు చెందిన గౌరవ్ చేతుల మీదుగా అవార్డులను అందించారు. మిత్రదీప్ సంస్థ ఈ అవార్డుకు ఎంపికవడంపై సందీప్‌ని అనేకమంది అభినందించారు. మరిన్ని సేవలను కొనసాగించాలని ఆకాంక్షించారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై నిరసనలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం ప్రకటించిన 4.7శాతం డీఏలో తగ్గించిన 1.6శాతం డీఏని కలిపి ఫిక్సేషన్ చేయాలని ఆర్టీసీ జేఏసీ డిమాండ్ చేసింది. సోమవారం ఆర్టీసీ జేఏసీ అధ్వర్యంలో ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఇచ్చిన జీఓలలో ముఖ్యంగా జూనియర్ అసిస్టెంటు, సీనియర్ అసిస్టెంటు, సూపరిం టెండెంట్, మెయింటెనెన్స్ విభాగాలలో ఉన్న ఆర్టిజెన్స్ కేటగిరీల్లో, సెక్యూరిటీ కానిస్టేబుల్, ఆర్సీ మరికొన్ని కేటగిరి ఉద్యోగుల స్కేల్స్, కేటగిరి ఫిక్సేషన్లలో జరిగిన అన్యాయాలను సరిచేయాలని, అలవెన్సులలో ఉద్యోగులకు నష్టం కలిగించేలా ఉన్న వాటిని సరిచేయాలని, తొలగించిన అలవెన్సులు పునరుద్ధరించాలని ఉద్యోగులు నినాదాలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాలలో 129 డిపోలు, నాలుగు వర్కుషాపులు, ఆర్టీసీహౌస్‌తో పాటు డీపీటీవో ఆఫీసులవద్ద ఈ నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆర్టీసీ ఉద్యోగులంతా ప్రభుత్వ ఉద్యోగులకు, ఆర్టీసీ ఉద్యోగులకు జీత భత్యాలలో ఉన్న తేడాలు సరిచేస్తారేమో అని ఎదురుచూస్తుండగా, అది జరగకపోగా పీఆర్సీ చైర్మన్ మిశ్రా ఇచ్చిన నివేదిక ప్రకారం 1.6శాతం అదనపు ఫిట్‌మెంటుతోపాటు 2017 ఏప్రిల్ 1నుంచి 2018 జులై 1వ తేదీ మధ్యకాలంలో ఉన్న డీఏ 4.7శాతం మొత్తం కలిపి 6.3శాతం ఫిట్‌మెంటును గతంలో ఆర్టీసీ ఉద్యోగులకు ఇచ్చిన తాత్కాలిక ఫిట్‌మెంట్ 25 శాతానికి కలిపి ఇవ్వవలసిఉండగా 3.1శాతం ఫిట్‌మెంట్ మాత్రమే ఇచ్చేలా జీవో ఇవ్వడం దారుణమన్నారు. దీనివల్ల సంస్థలో పనిచేస్తున్న 52 వేలమంది ఉద్యోగులకు నష్టం జరుగుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా జీఓ 113/114 లో మార్పులు చేసి ఆర్టీసీ ఉద్యోగులందరికీ కనీసం 4.7శాతం డీఏలో తగ్గించిన 1.6శాతం డీఏ కూడా స్కేల్స్‌లో కలిపేలా జీఓలు ఇచ్చి న్యాయం జరిగేలా ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలని ఆర్టీసీ జేఏసీ నేతలు విజ్ఞప్తి చేశారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఏపీ పీటీడీ(ఆర్టీసి) ఉద్యోగసంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ కన్వీనర్లు వై.శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు, కో-కన్వీనర్లు సీహెచ్ సుందరయ్య, వైఎస్ రావు, జేఏసీ నాయకులు ఎన్ఎంయూఏ రాష్ట్ర అధ్యక్షులు పీవీరమణారెడ్డి, ఈయూ రాష్ట్ర అధ్యక్షులు వైవీరావు తెలిపారు.

మా మధ్య ఆ చర్చ రాలేదు: ఉండవల్లి

రాజమహేంద్రవరం: కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత మొదటిసారి ఆయన్ను కలిశానని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం తాను కేసీఆర్‌తో మాట్లాడినట్టు చెప్పారు. అయితే జాతీయ పార్టీ ఏర్పాటు గురించి వారి మధ్య ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. భేటీలో బీజేపీ గురించి చర్చించామని.. ఆ పార్టీపై ఇద్దరికీ ఒకే రకమైన అభిప్రాయాలున్నాయన్నారు. రాజమహేంద్రవరంలో ఉండవల్లి మీడియాతో మాట్లాడుతూ..'ఏపీలో బీజేపీ బలంగా ఉంది. ఏ పార్టీ ఎంపీ సీట్లు గెలిచినా.. అవి బీజేపీవే. ఏపీలో ఉన్న బలం బీజేపీకి మరో రాష్ట్రంలో లేదు. వైసీపీ, టీడీపీ, జనసేన అన్ని పార్టీలు బీజేపీకే మద్దతు ఇస్తాయి. ఏపీలో బీజేపీని వ్యతిరేకించే పరిస్థితి లేదు" అని ఉండవల్లి తెలిపారు. 'బీజేపీపై నాకు ఎలాంటి వ్యతిరేకత లేదు. మోదీ మరోసారి ప్రధాని అయినా నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. ముస్లిం, క్రైస్తవులకు వ్యతిరేకమనే ముద్ర భారత్‌కు మంచిది కాదు. బీజేపీ నేతల వ్యాఖ్యల వల్ల ముస్లిం దేశాల్లో వ్యతిరేకత వస్తోంది. నాలుగైదు దేశాలు క్షమాపణ చెప్పాలని భారత్‌ను కోరాయి. ఎవరు అధికారంలో ఉన్నా ప్రశ్నించే ప్రతిపక్షం గట్టిగా ఉండాలి. మోదీ ఒక నిరంకుశ రాజులా పాలిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీ ఉండొద్దనే కోణంలోనే బీజేపీ ముందుకు వెళ్తోంది. దేశంలో బీజేపీకు వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడే పరిస్థితి లేదు. కేసీఆర్ మాత్రం ధైర్యంగా వ్యతిరేకంగా వెళ్తున్నారు. జాతీయ అంశాలపై కేసీఆర్ కసరత్తు చేశారు. చాలా విషయాల్లో కేసీఆర్ స్పష్టమైన అవగాహనతో ఉన్నారు. ప్రతి విషయాన్ని ఆయన స్పష్టంగా వివరించారు. బీజేపీ వల్ల దేశానికి ప్రమాదం ఉందని చెప్పారు. బీజేపీను అడ్డుకోకపోతే మరింత నష్టమన్నారు. నేను మాత్రం రాజకీయాలకు దూరంగా ఉంటానని చెప్పాను. మా భేటీలో ప్రశాంత్ కిశోర్ కూడా ఉన్నారు. ప్రధాని మోదీలాగే కేసీఆర్ కూడా మంచి వక్త, కమ్యూనికేటర్. కేసీఆర్ హిందీ, ఇంగ్లీష్‌లోనూ బాగా మాట్లాడగలరు. బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఇతర రాష్ట్రాల్లో పెద్దగా ప్రభావం చూపలేరు" అని ఉండవల్లి పేర్కొన్నారు.

'గీతం' చెస్‌పోటీలు... భారత క్రీడాకారుల ఆధిక్యం

విశాలాంధ్ర-మధురవాడ: ప్రపంచ చదరంగ సమాఖ్య (ఫైడ్), అఖిల భారత చదరంగ సమాఖ్య పర్యవేక్షణలో ఆంధ్ర చదరంగ సంఘం వారం రోజుల పాటు నిర్వహిస్తున్న గీతం యూనివర్సిటీ 3వ వైజాగ్ గ్రాండ్ మాస్టర్స్ ఇంటర్నేషనల్ చెస్ టోర్నమెంట్-2022 పోటీల్లో సోమవారం భారత క్రీడాకారుల ఆధిపత్యం కొనసాగింది. సోమవారం జరిగిన పోటీల్లో 'ఎ' కేటగిరి విభాగంలో 5వ రౌండ్ పూర్తయ్యేసరికి ఐదుగురు క్రీడాకారులు 4.5/ 5 పాయింట్ల ఆధిపత్యంతో కొనసాగుతున్నారని ఆంధ్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.భీమారావు తెలిపారు. వీరిలో ఇద్దరు భారత క్రీడాకారులు కె.పొన్ను స్వామి (2299ర్యాంక్), ఎ.అమేయ (2395 ర్యాంక్) ఉన్నారని తెలిపారు. రెండు రోజులుగా అద్భుత ప్రతిభ చాటిన విశాఖ యువ క్రీడాకారుడు జి.ఆదిత్య వరుణ్ 3.5/5 పాయింట్లతో నిలిచాడు. 'బి' కేటగిరి విభాగంలో 6వ రౌండ్ పూర్తయ్యేసరికి పాండిచ్చేరి క్రీడాకారుడు ఉమాశంకర్ (1873 ర్యాంక్) ప్రతిభను చాటి 6/6 పాయింట్ల ఆధిక్యంతో అగ్రస్థానంలో నిలవగా మరో ఐదుగురు క్రీడాకారులు 5.5/ 6 పాయింట్ల ఆధిపత్యంతో కొనసాగుతున్నారని కార్యదర్శి తెలిపారు. వీరిలో ఏపీలోని రాజమహేంద్రవరానికి చెందిన క్రీడాకారుడు కె.మహేశ్ కుమార్ (1882 ర్యాంక్) ఉన్నారని పేర్కొన్నారు.

మాట్లాడుతున్నహరినాథరెడ్డి. పక్కన మురళి, గురవయ్య, రామానాయుడు, పెంచలయ్య తదితరులు

రాష్ట్రపతి ఎన్నికల్లో మీరు ఎటువైపు?

సీఎం జగన్‌కు హరినాథరెడ్డి ప్రశ్న

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: రాష్ట్రపతి ఎన్నికల్లో ఎటువైపు ఉంటారో తేల్చుకోవాలని సీఎం జగన్‌కు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి హితవు పలికారు. రాష్ట్రానికి మోదీ ప్రభుత్వం చేసిన అన్యాయం దృష్ట్యా ప్రతిపక్షం బలపరుస్తున్న అభ్యర్థికి ఓటు వేసి బీజేపీకి ఝలక్ ఇవ్వాలని సూచించారు. శ్రీకాళహస్తిలోని దేవీఫంక్షన్ హాల్‌లో సీపీఐ తిరుపతి జిల్లా కార్యవర్గ సభ్యుల సమావేశం జనమాల గురవయ్య అధ్యక్షతన సోమవారం జరిగింది. హరినాథరెడ్డి మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని విమర్శించారు. కేంద్రం వైఖరిపై సీఎం జగన్ నోరు మెదపకపోవడం దారుణమన్నారు. రాష్ట్రానికి న్యాయం చేసుకునే అవకాశం ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చిందని, రాష్ట్రపతి ఎన్నికల్లో రాష్ట్రం సత్తా చూపించాలని సూచించారు. నవరత్నాలలో భాగంగా పేదల కోసం ఇంటి స్థలాలు 32 లక్షల మందికి ఇవ్వడమే తప్ప ఒక్క పేదవాడికీ ఇల్లు కట్టించలేదన్నారు. తిరుపతివాసులకు 40 కిమీ దూరంలో స్థలాలు ఇవ్వడం, అవి కూడా కోర్టు వివాదంలో ఉండడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జగన్ వైఫల్యాలపై ప్రజల్ని పోరాటాలకు సిద్ధం చేయాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ జులై చివరి నాటికి గ్రామ, మండల, జిల్లా మహాసభలు పూర్తి చేసి ఆగస్టులో రాష్ట్ర మహాసభలు, అక్టోబరులో జాతీయ మహాసభలకు సిద్ధంగా ఉండాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, ప్రభాకర్, జిల్లా కార్యవర్గసభ్యులు చిన్నం పెంచలయ్య, పార్థసారథి, జె.విశ్వనాథ్, జె.గురవయ్య, సుధాకర్‌రెడ్డి, రమణయ్య, బాలకృష్ణ, ఆనంద్, బి.నదియా తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలపై

21న కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఓబులేశు పిలుపు

మాట్లాడుతున్న ఓబులేశు. పక్కన రామచంద్రయ్య, మాల్యాద్రి, పులగం, రవికుమార్ తదితరులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : కార్మికుల సమస్యల పరిష్కారానికై ఈనెల 21న రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల కలెక్టరేట్ల ఎదుట మున్సిపల్ కార్మికులు పెద్దయెత్తున ధర్నాలు నిర్వహించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేశు పిలుపునిచ్చారు. సోమవారం గొల్లపూడిలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఆసుల రంగ నాయకులు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఓబులేశు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ పారిశుద్ధ్య ఇంజనీరింగ్ కార్మికుల పట్ల పూర్తి నిర్లక్ష్య ధోరణి వ్యవహరిస్తోందని మండిపడ్డారు. మున్సిపల్ కార్మికులకు గత ఆరు నెలలుగా చెల్లించాల్సిన హెల్త్ అలవెన్స్ లను చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన కార్మిక చట్టాలకు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆమోదం తెలపడంతో ఉద్యోగులు, కార్మికులు నిర్బంధంగా 12 గంటల పాటు శ్రమించాల్సిన పరిస్థితి ఉత్పన్నమైందన్నారు. ఇది కార్మికులను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేయడమేనని, దీనివల్ల వారి ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఈనెల 21వ తేదీ ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కలెక్టరేట్‌ల ఎదుట నిర్వహించే ధర్నాలో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి నిరసనను తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఏపీ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బారాయుడు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థలో కార్మికుల శ్రమదోపిడి రోజురోజుకూ పెరిగి పోతున్నదన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సుప్రీంకోర్టు ఆదేశాలున్నా రాష్ట్రంలో ఆ వైపుగా కార్మిక, మున్సిపల్ శాఖలు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. పర్మినెంట్ కార్మికులకు సంబంధించి డిసెంబర్ -2021 నాటికి చెల్లించాల్సిన సరెండర్ లీవ్‌ల ఎన్‌క్యాష్‌మెంట్ ఇంతవరకు ప్రభుత్వం జమ చేయలేదని, అలాగే రిటైరైన కార్మికుల బెనిఫిట్స్‌ను ఇవ్వకుండా తీవ్రమైన ఇబ్బందులకు గురి చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో పోరాటమే శరణ్యమని, 21న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట ధర్నా కార్యక్రమాలకు కార్మికులు భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జే రామచంద్రయ్య, కోట మాల్యాద్రి, పులగం మద్దిలేటి, కే జాన్, ఉప ప్రధాన కార్యదర్శి బందెల రవి కుమార్ కార్యదర్శులు కోటి దాసు, తాడికొండ వాసు, ఎన్ శ్రీనివాస్, కోశాధికారి ఇ.కె మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మల్లం దళితులకు మద్దతుగా

దళిత సంఘాల ఐక్యవేదిక ధర్నా

విశాలాంధ్ర-కాకినాడ: మల్లం గ్రామంలో దళితులపై దాడి చేసినవారిపై కేసులు నమోదు చేయాలని, కాకినాడలో దళిత సంఘాల ఐక్యవేదిక అధ్వర్యాన సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ రావు, కుల వివక్ష పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి, దళిత నాయకులు అయితా బత్తుల రామేశ్వరరావు, జె వెంకటేశ్వరరావు, తోకల ప్రసాద్, ఏనుగుపల్లి కృష్ణ, కొండబాబు, దానం లాజర్ బాబు, బచ్చుల కామేశ్వరరావు, పిట్ట వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాకినాడ జిల్లా పిఠాపురం మండలం మల్లంలో దళితులపై అగ్రవర్ణాలకు చెందినవారు దాడిచేసి రెండు నెలలు గడుస్తున్నా పోలీసులు ముద్దాయిలను అరెస్టు చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. దళితులపై దాడులు జరిగిన సందర్భంలో న్యాయం కోసం రోడ్డెక్కి ధర్నాలు చేస్తేనే గాని పోలీసులు స్పందించడం లేదన్నారు. రెండు నెలలుగా కేసుపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పిఠాపురం సీఐ ని తక్షణమే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. దళితులపై దాడులు జరుగుతుంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌నుంచి కనీస స్పందన లేదని, రాబోయే ఎన్నికల్లో దళితులంతా వైసీపీకి వ్యతిరేకంగా ఓటేయాలని వారు పిలుపునిచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మల్లంలో జరిగిన సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి... దోషులకు కఠిన శిక్ష విధించాలని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండు చేశారు. కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తే దళిత సంఘాలు తీవ్రస్థాయిలో ఆందోళన చేస్తాయని హెచ్చరించారు. తొలుత ఐడియల్ కాలేజీ నుంచి ప్రదర్శన ప్రారంభమైంది. ఇంద్రపాలెంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసిన అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వస్తుండగా పోలీసులు, దళిత సంఘాల నాయకులకు వాగ్వాదం జరిగింది. పోలీసులను తోసు కుంటూ దళిత సంఘాల కార్యకర్తలు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నట్లు నాయకులు తెలిపారు. ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లాకి దళిత సంఘాల నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు సకా రామకృష్ణ, బాధిత కుటుంబాలు, మల్లం గ్రామస్తులు, దళిత సంఘాలు, ప్రజా సంఘాల కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

పాలకుల విధానాలతోనే క్రాప్ హాలిడే

కేవీవీ ప్రసాద్ విమర్శ



సమావేశంలో మాట్లాడుతున్న కేవీవీ ప్రసాద్. వేదికపై మధు, సత్తిబాబు, సత్యనారాయణ తదితరులు

విశాలాంధ్ర-కాకినాడ: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా, రైతు వ్యతిరేక విధానాల ఫలితంగా కోనసీమ తదితర ప్రాంతాల్లో రైతులు క్రాప్ హాలిడేకు సిద్ధపడుతున్నారని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ విమర్శించారు. స్థానిక పొన్నమండ రామచంద్ర రావు (ఆర్ఆర్) భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సమావేశం రైతుసంఘం రాష్ట్ర కోశాధికారి చెల్లుబోయిన కేశవశెట్టి అధ్యక్షతన సోమవారం ఉదయం జరిగింది. కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతు సంఘాలు ఐక్యంగా పోరాడి విజయం సాధించాయని గుర్తుచేశారు. ఆ ఉద్యమం ద్వారా రైతుల సత్తా ఏమిటో మోదీకి తెలిసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీల అమలులో తీవ్ర జాప్యం జరుగుతోందని ఆయన విమర్శించారు. పంటలకు కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధరలు సక్రమంగా లేవని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. రైతుకుటుంబం నెలవారీ ఆదాయం 10,218 రూపాయలు మాత్రమే ఉందని, రైతాంగానికి రుణ విమోచన చట్టం తీసుకు రావాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. కౌలు రైతులందరికీ బ్యాంకు రుణాలు అందజేయాలని, ఈ నెల 20న ఖరీఫ్ పంటలకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు 70 శాతం సబ్సిడీపై ఆర్‌బీకేల ద్వారా అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సీపీఐ తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కార్యదర్శి కె.సత్తి బాబు, కాకినాడ జిల్లా కార్యదర్శి పి.సత్య నారాయణ, రైతుసంఘం రాష్ట్ర సమితి సభ్యులు బొమ్మసాని రవిచంద్ర, రైతుసంఘం జిల్లా నాయకులు ఎ.జ్యోతిరాజు, సీహెచ్ తాతారావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జి.లోవరత్నం తదితరులు ప్రసంగించారు.

జిల్లాల నూతన కమిటీలు ఎన్నిక

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మూడు జిల్లాల కమిటీలను సోమవారం ఎన్నుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కన్వీనర్‌గా చెల్లుబోయిన తాతారావు, కో కన్వీనర్‌గా కుంపట్ల వరుణ్ బాబు, కమిటీ సభ్యులుగా రెడ్డి సత్యనారాయణ, సానబోయిన లక్ష్మణ స్వామి,

సీహెచ్ శేఖర్, పితాని ఆనందరావు ఎన్నికయ్యారు. తూర్పు గోదావరి జిల్లా రైతుసంఘం కన్వీనర్‌గా కె.జ్యోతిరాజు, కమిటీ సభ్యులుగా ఎ.సత్యనారాయణ, ఎస్. ప్రేమ్‌కుమార్, నక్కా వీరపండు, చంద్రరావు ఎన్నికయ్యారు. కాకినాడ జిల్లా రైతు సంఘం జిల్లా కన్వీనర్‌గా శివకోటి రాజు, కమిటీ సభ్యులుగా నక్కా శ్రీనివాసరావు, అప్పలరాజు, బోర కొండ, కె.ఆదినారాయణ ఎన్నికయ్యారు.



ప్రైవేటు బస్సు బోల్తా.. ఐదుగురి మృతి

మద్యం మత్తులో బస్సు డ్రైవర్: డ్రైవర్, క్లీనర్ పరార్

విశాలాంధ్ర-చింతూరు: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలోని ఏడుగురాళ్ళపల్లి-బొడ్డుగూడెం గ్రామాల మధ్య ఆదివారం అర్ధరాత్రి ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా కొట్టింది. డ్రైవర్ మద్యం సేవించి నిద్రమత్తులో ఉండటంతో ఈ ప్రమాదం జరిగినట్టు ప్రయాణికులు చెబుతున్నారు. ఈ బస్సు ఒడిశాలోని భవానిపట్నం జిల్లా చిన్నపల్లి నుంచి విజయవాడ వెళుతోంది. విషయం తెలుసుకున్న చింతూరు సీఐ అప్పల నాయుడు, ఎస్ఐ యాదగిరి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని గాయపడ్డ వారిని భద్రాచలం, చింతూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘటనలో ఇద్దరు పిల్లలు సహా ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి.

వారి పరిస్థితి విషమంగా ఉండటంతో భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారిలో నయా పుడా గ్రామానికి చెందిన ఇద్దరు మృతి చెందారు. దీంతో మృతు సంఖ్య ఐదుకు చేరింది. డ్రైవర్ మద్యం సేవించడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు బస్సులోని ప్రయాణికులు చెప్పారు. ఘటనలో గాయపడిన వారిని భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. చింతూరు సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ యాదగిరి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సంపాదకీయం

బుల్డోజర్ల యోగ విన్యాసం

అతడు నేరస్థుడే కావొచ్చు. ముస్లిం కావడం ప్రస్తుత దశలో మహా పాపం కిందే లెక్క. ఈ దేశంలో చట్టాలున్నాయి. రాజ్యాంగం ఉంది, న్యాయ వ్యవస్థా ఉంది. అయినా నేరస్థులంటున్న ముస్లింలకు అండగా ఎవరూ నిలబడరు. ఈ బుల్డోజర్లు ఇళ్లు నేలమట్టం చేస్తుంటే, రాయి రాయి విడగొడ్తుంటే, బుల్డోజర్ల వల్ల దుమ్ము ధూళి రేగుతూ ఉంటే తమాషా చూస్తున్న వారు కేరింతలు కొడతారు. మీడియాలో బలమైన వర్గం ముఖాల్లోనూ యోగీ ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఒక వర్గం ప్రజలపై కఠినంగా విరుచుకుపడడం ఆనందాతిరేకాలు రేపుతుంది. వారి ముఖాలు వెలిగి పోతుంటాయి. వీరెవరికీ దేశంలో చట్టాలున్నాయని, పకడ్బందీ అయిన రాజ్యాంగం ఉందని గుర్తుకురాదు. న్యాయవ్యవస్థ కూడా మౌన ముద్రలోనే ఉంటుంది. యోగీ ఆదిత్యనాథ్ ఎంత పటిష్ఠమైన పాలకుడు అన్న మురిపెంలో ప్రజాస్వామ్య సౌధం ధ్వంసం అయిపోతోందని వారికి తోచనే తోచదు. ఈ దాష్టీకాన్ని చూస్తూ ఇతర రాజకీయ పార్టీల కార్యకర్తలు, నాయకులు కూడా నిశ్చేష్టంగా ఉండిపోతారు తప్ప ఎదిరించే సాహసం చేసే స్థితిలో లేరు. పాలకుల అఘాయిత్యాలను ఎదుర్కోవడం తమ బాధ్యత అని ప్రతిపక్షాలకు ఏ మాత్రమైనా స్పృహ ఉండదు. ప్రతిపక్ష నేతలూ భయకంపితులై ఉన్నారేమో! తమ మీద ఉన్న ఆరోపణల ఫైళ్లు ఎప్పుడు తెరుచుకుంటాయోనన్న భయంతోనే మౌన ముద్రాంకితులై ఉంటారేమో! నిరపరాధులైన రాజకీయ నాయకుల జాడే లేదా అన్న అనుమానం వచ్చే అమాయకులు కొందరైనా ఉన్నా వారు చేయగలిగింది ఏమీ ఉండదా? అధికారం చేతిలో ఉన్న వారి ఇష్టారాజ్యం కొనసాగవలసిందేనా? వివిధ శాసనసభల్లో, పార్లమెంటులో నేర చరితులు ఆశీనులై ఉన్నారు కనక ఎవరి నోరూ పెకలడం లేదేమో! ఉత్తరప్రదేశ్‌లో వందకన్నా ఎక్కువ మంది నేరచరిత్ర ఉన్న వారే ఉన్నారు. వీరందరి ఇళ్లపై బుల్డోజర్లు ఎందుకు వినియోగించరు అని అడిగేవారు ఎక్కడా కనిపించడం లేదు. మొన్న దిల్లీలో సీపీఎం నాయకురాలు బృందా కారత్ ఒక్కరే మినహాయింపు. బుల్డోజర్లు మధ్యప్రదేశ్‌లోనూ వీరవిహారం చేశాయి. అక్కడ కూడా అనేక మంది శాసనసభ్యుల మీద అనేకానేక ఆరోపణలున్నాయి. ఈ బుల్డోజర్లు ఎందుకు వినియోగిస్తున్నారు అన్న ప్రశ్నకు యోగీ ఆదిత్య నాథ్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దగ్గర సమాధానం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. అక్రమ కట్టడాలు మాత్రమే కూల్చేస్తున్నామని తక్కున సమాధానం చెప్తారు. అక్రమ కట్టడాలను కూల్చేయడానికి సైతం ఓ పద్ధతి ఉంటుంది. చట్టం ఉంటుంది. కానీ నోరు లేని బుల్డోజర్లకు ఇవేవీ తెలియవు, తెలిసిందల్లా ముస్లింల ఇళ్లను నేలమట్టం చేయడమే. దిల్లీ సంగతే తీసుకుంటే అక్రమ నిర్మాణాలన్నింటినీ కూల్చి వేయవలసిన పరిస్థితే వస్తే 60 శాతం భవనాలు కూల్చేయవలసిందేనని సాక్షాత్తు ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు అరవింద్ కేజ్రీవాలే అంగీకరిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నో, ప్రయాగ్ రాజ్, కాన్పూర్, బెనారస్, ఘాజియా బాద్; మధ్యప్రదేశ్‌లోని భోపాల్, ఇండోర్‌లో ఉదాహరణ ప్రాయంగా అక్రమ నిర్మాణాల గురించి పరిశీలించినా ముస్లింల ఇళ్లే ఎక్కువ ధ్వంసం అయినాయి. ఈ నగరాలలో అక్రమ నిర్మాణాలను తొలగించాలనే సంకల్పిస్తే 45 శాతం భవనాలు నామరూపాలు లేకుండా పోవాల్సిందే. కానీ అపరాధులని అధికారంలో ఉన్న పార్టీ భావించిన వారి ఇళ్లను మాత్రమే బుల్డోజర్లు నేలమట్టం చేస్తాయి. మిగతా వాటి జోలికెళ్లవు. అక్రమం అంటున్న ఇళ్లు ముస్లింలవి అయితే కూల్చివేత ఖాయంలా మారింది. అపరాధం చేశారంటున్న వారి పక్కన నాయకులు నిలబడరు. కానీ ఇవ్వాళ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ ఎదుట హాజరు కావడానికి బయలు దేరితే వందలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు కదిలారు. పరిస్థితి ఏమిటంటే రాజకీయ పార్టీల కార్యకలాపాలకు జనంతో పని లేదు. జనం సమస్యలను పట్టించుకునే ఓపిక శ్రద్ధ అధికారం కోసం పోటీ పడ్తున్న రాజకీయ పార్టీలకూ లేదు. ఇది వాస్తవ పరిస్థితి. మహమ్మద్ ప్రవక్త మీద అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన బీజేపీ నాయకులకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన చేసిన వారి ఇళ్లను వెతుక్కుంటూ వెళ్లి కూల్చేయడంలోనే బుల్డోజర్లు నిమగ్నమై ఉన్నాయి.

కాన్పూర్‌లో, షహరాన్ పూర్‌లో ఇద్దరు నిరసనకార్ల ఇళ్లను ధ్వంసం చేయడానికి ఆదివారం బుల్డోజర్లు కవాతు చేశాయి. ప్రయాగ్ రాజ్‌లో మహమ్మద్ జావేద్ అనే రాజకీయ కార్యకర్త, వ్యాపారస్థుడి ఇంటి మీద బుల్డోజర్లు ప్రతాపం చూపించాయి. ఆయన ఇల్లు అక్రమ నిర్మాణం అవునా కాదా అన్న విషయం చర్చనీయాంశమే కావచ్చు. కానీ ఆయనకు ఒక్క రోజు ముందు మాత్రమే నోటీసు ఇచ్చారు. మరీ విచిత్రం ఏమిటంటే బుల్డోజర్లు నేలమట్టం చేసిన ఇల్లు జావేద్ భార్య పేర ఉంది. కానీ అధికారులు ఒక్క రోజు ముందు నోటీసు ఇచ్చింది జావేద్‌కు. ముస్లింలకు వర్తించే చట్టం ప్రకారం భార్య ఆస్తిపై భర్తకు ఎలాంటి హక్కూ ఉండదు. చట్టాన్నే ఖాతరు చేయని యోగీ ప్రభుత్వానికి చట్టంలోని సూక్ష్మాల మీద దృష్టి ఎటూ ఉండదు. జావేద్ వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా కేంద్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు. ఈ పార్టీ 2011లో నెలకొల్పారు. ఆయనను ఆదివారం అరెస్టు చేశారు. ప్రయాగ్ రాజ్‌లో శుక్రవారం జరిగిన నిరసన ప్రదర్శనలకు ఆయనే కారకుడని ప్రభుత్వం వాదిస్తోంది. జావేద్ మీద కేసు బలంగా ఉండాలి కనక ఆదివారం ఆయన ఇంట్లో పోలీసులు సోదా చేస్తే నాటు పిస్తోళ్లు దొరికాయంటున్నారు. అభ్యంతరకరమైన పోస్టర్లు, అనేక తూటాలూ దొరికాయట. యోగీ పోలీసుల వాదన నిజమే అనుకున్నా పోలీసులు చెప్పిన కథనం ప్రకారమే బుల్డోజర్లు ప్రయోగించడం ఏ చట్టం రీత్యా న్యాయం అవుతుంది అన్న ప్రశ్నకు సమాధానం ఉండదు. నిరసన తెలపడమే నిషేధమైతే, నిరసనకారుల ఇళ్ల మీద బుల్డోజర్లు నడపడమే న్యాయం అయితే స్వాతంత్ర్య పోరాటం పొడవునా బ్రిటిష్ వారు ఎన్ని వేల, లక్షల ఇళ్లు కూల్చి ఉండాలి. పోర్ బందర్‌లో, సేవాగ్రాంలో గాంధీ ఇళ్ల ఆనవాలైనా ఉండేదా? బ్రిటిష్ వారిపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిన రవీంద్ర నాథ్ ఠాగోర్, నేతాజీ సుభాష్ చంద్ర బోస్ ఇళ్లు ఇంకా కోల్‌కతాలో కనిపించేవా? ప్రయాగ్ రాజ్‌గా కొత్త అవతారం ఎత్తిన అలహాబాద్‌లో నెహ్రూ ఇల్లు ఆనంద్ బాగ్ మిగిలి ఉండేదా? వీరందరూ బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేసిన వారేగా! బ్రిటిష్ వారు మరో ప్రయోజనం కోసం విభజించి పాలించే దుర్నీతిని అనుసరిస్తే ప్రస్తుతం సంఘ్ పరివార్ ప్రభుత్వాలు ముస్లింలను ఏరి వేయడానికి ఆ విభజించి పాలించే విధానాన్ని సంపూర్ణం చేస్తున్నాయి.

స్వచ్ఛంద రక్తదానం యువత నినాదం కావాలి

డా. బుర్ర మధుసూదన్ రెడ్డి

రక్తాన్ని ఏ ప్రయోగశాలలోనూ తయారు చేయలేం. రక్తానికి మరో ప్రత్యామ్నాయం లేదు. ప్రమాదాలలో గాయపడిన వేళ, పలు తీవ్ర అనారోగ్యాల్లో, ప్రసవ సమయాల్లో, సంక్లిష్ట శస్త్రచికిత్సలు చేసే క్షణాల్లో, ప్రాణాపాయంతో కొట్టుమిట్టాడే వ్యక్తులకు సురక్షిత రక్తం లేదా రక్త ఉత్పత్తులు అత్యవసరంగా అందిస్తేనే ప్రాణాలు నిలుస్తాయి. ఇలాంటి అమూల్యమైన సేవలను రక్తదాతలు మాత్రమే అందించగలరు. రక్తదాన యజ్ఞంపై ప్రజల్లో అవగాహన కల్పించడం, దాతలను సముచితంగా గుర్తించి ప్రోత్సహించడం, రక్తదానం పట్ల అపోహలను తొలగించడం కోసం ఐరాస, రెడ్ క్రాస్ సొసైటీలు సంయుక్తంగా ఏటా జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినం నిర్వహిస్తున్నాయి. 2005లో ప్రారంభమైన ప్రపంచ రక్తదాతల దినం వేదికగా 192 దేశాలు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రచారం ప్రారంభించాయి. సకాలంలో రక్తం అందక ప్రాణాలు కోల్పోయే అభాగ్యుల పట్ల సహానుభూతిని ప్రదర్శిస్తూ, ఏటా కనీసం 2-3 సార్లు అయినా రక్తదానం చేసే అలవాటును ప్రతి ఒక్కరు, ముఖ్యంగా యువత చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాయి. రక్తం ఎ, బి, ఎబి, ఒ అనే నాలుగు రకాలుగా ఉంటుందని కనుగొన్న ప్రఖ్యాత శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత 'కార్ల్ లాండ్ స్టేనర్' జన్మదినాన్నే (14 జూన్, 1868) ప్రపంచ రక్తదాతల దినంగా పాటిస్తున్నారు.

ప్రభుత్వాలు, వైద్య రంగం, స్వచ్ఛంద సంస్థలు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసేందుకు చొరవ చూపాలి. రక్తం నిలువ చేయడం, రక్త పరీక్షల నిర్వహణ, రక్తనిధి కేంద్రాల స్థాపన, రక్త సేకరణ, రక్తం అందరికీ అందుబాటులో ఉంచడం లాంటి అంశాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. రక్తదాతలు సేవా గుణంతో మిలియన్ల ప్రాణాలు నిలుపుతున్నారు. ప్రపంచ దేశాలన్నింటిలో రక్తదానం అత్యవస రమే. విశ్వమంతటా రక్త కొరత ఉంది. అధిక జనాభాగల అభివృద్ధి చెందుతున్న భారత్ లాంటి దేశాల్లో రక్త కొరత తీవ్రంగా ఉంది. ఈ ఏడాది (2022) ప్రపంచ రక్తదాతల దినం నినాదంగా 'రక్తదానం ఓ సంఘీభావ క్రియ-ప్రాణాలు నిలిపే యజ్ఞంలో చేతులు కలుపుదాం' అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు. స్వచ్ఛంద రక్తదాతలకు కృతజ్ఞ తలు తెలపడం, కొత్త దాతలను ఆహ్వానించడం, డబ్బు కోసం రక్తదానం చేసే వారిని నిరోధించడం, రక్తదాన ప్రాముఖ్యతను వివరిం చడం, యువత రక్తదాతలుగా ప్రజారోగ్య పరిరక్షణలో మానవీయతను చాటడం లాంటి పలు ప్రచారాలను విరివిగా నిర్వహించాలి. రక్తంతో పాటు రక్త ఉత్పత్తులైన ప్లేట్లెట్లు, ప్లాస్మా, క్రయో, తెల్ల/ఎర్ర (ఎరిత్రోసైట్స్, ల్యూకో సైట్స్) రక్త కణాలు, గ్రాన్యులోసైట్స్ లాంటివి కూడా రోగులకు అత్యవస రంగా అందించాల్సినవే.

భారతదేశంలో 5 కోట్ల యూనిట్ల రక్తం అవసరం ఉండగా 3 కోట్ల యూనిట్లు మాత్రమే రక్తదాతల ద్వారా లభిస్తున్నది. ప్రతి రోజు 38,000 రక్తదానాలు జరగాల్సి ఉంది. సంపూర్ణ ఆరోగ్యం, 50 కిలోలు మించి బరువు, 18-65 ఏండ్ల వయస్సు, డెసిలీటర్ రక్తంలో 12.5 గ్రాముల హిమోగ్లోబిన్ లాంటి అర్హతలు కలిగిన ప్రతి ఒక్కరు ప్రతి 3 మాసాలకు ఒకసారి రక్తదానం చేయవచ్చు. హెచ్ఐవి, గుండె జబ్బులు, హెపటైటిస్ బి, రాబిస్, గర్భిణులు, నిత్యం ఆల్కహాల్ సేవించే వారు, పాలు ఇచ్చే తల్లులు, తీవ్ర అనారోగ్యం నుంచి కోలుకున్నవారు, ఫిట్స్, టి.బి, ఎలర్జీ, అస్తమా లాంటి లక్షణాలు ఉన్నవారు రక్తదానం చేయకూడదు.

రక్తదానంతో ప్రాణాలనే కానుకగా ఇవ్వవచ్చు. మరే ప్రత్యామ్నాయం లేని అత్యంత విలువైన రక్తాన్ని దానం చేయడానికి 10-15 నిమిషాల సమయం మాత్రమే పడుతుంది. స్వచ్ఛందంగా కనీసం ఏడాదికి 3 సార్లు అయినా రక్తదానం చేస్తూ, అవసరార్థుల ప్రాణాలను కాపాడుదాం, రక్తదానమే మహాదానమని నినదిద్దాం.

(నేడు ప్రపంచ రక్తదాతల దినం)

వ్యాస రచయిత సెల్ 9949700037

ఆచరణలో రెండు రకాల న్యాయాలు

జస్టిస్ మదన్ బి. లోకూర్ (రిటైర్డ్)

మన దేశంలో రెండు రకాల న్యాయ వ్యవస్థలున్నాయా? సుప్రీంకోర్టు మనకు రెండు న్యాయ వ్యవస్థలు లేవని తెలియజేసింది. "సంపద, వనరులు, రాజకీయాధికారం, పలుకుబడి గల వారికి ఒకటి, వనరులు, అన్యాయంపై పోరాడి న్యాయం పొందే శక్తి లేనివారికి మరొక న్యాయం లేదు." అని సుప్రీం కోర్టు తెలిపింది. అయితే వాస్తవంగా రెండు న్యాయ వ్యవస్థలు పని చేస్తున్నాయి. ఇటీవల ముండ్క అగ్ని కీలల విషాదం, జహంగీర్ పురి బుల్డోజర్ విధ్వంసం మనకు రెండు న్యాయ వ్యవస్థలు ఉన్నాయని స్పష్టం చేస్తున్నాయి. దిల్లీ చుట్టూ, దేశ వ్యాప్తంగా అక్రమ నిర్మాణాలు అనేకం ఉన్నాయి. దిల్లీలో 80 శాతం అక్రమ నిర్మాణాలేనని, ఆక్రమణలేనని ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. ఇటీవల జరిగిన ఇళ్ల కూల్చివేత వల్ల 63 లక్షల మంది నిర్వాసితులయ్యారు. నిర్వాసితులంతా ఇళ్లు, తగిన ఆదాయం లేని ప్రజలే. అన్ని వనరులు, సంపద, రాజకీయాధికారం, పలుకుబడి కలిగిన వారిని ముట్టుకునే ధైర్యం మున్సిపల్ అధికారులకు లేదు. ఇళ్ల కూల్చివేత విషాదానికి ముందు భవనాల నిర్మాణానికి అనుమతులు లేని నిర్మాణాలు జరిగాయి. ఈ భవనాలన్నీ సంపన్నులు, రాజకీయ అధికారం, పలుకుబడి గలవారికి చెందినవే గనుక వాటిని ముట్టుకోలేదు.

1997లో జరిగిన ఉపహార్ సినిమా విషాదం ఇప్పటికీ మనల్ని వెంటాడుతూనే ఉంది. ఈ విధ్వంసం జరిగి సోమవారం నాటికి (జూన్ 13) 25 ఏళ్లు అయింది. హృదయ విదారకమైన ఆనాటి విషాదంలో 59 మంది ప్రాణాలు కోల్పోగా 100 మందికి పైగా గాయపడ్డారు. అదొక పీడకల. ఆ విషాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలు నేటికీ కోలుకోలేని పరిస్థితిల్లో ఉన్నాయి. ఆ విషాదానికి కారకులైన వారికి ఎలాంటి శిక్షలు లేవు. బాధితులకు ఊరట లేదు. తమ పరిధిలోనే జరిగిన విషాదంపై మున్సిపల్ అధికారుల స్పందన ఏమిటనేది నా ప్రశ్న. చట్టాలను ఎందుకు వినియోగించలేకపోయారు? నేరపూరిత నిర్లక్ష్యానికి తగిన శిక్షలకు వీరు అర్హులు కాదా? ఈ విషాదాన్ని చాలా తేలికగా తీసుకున్నారు. న్యాయశాస్త్రం జవాబుదారీ విధానం దేశంలో కనిపించక పోవటం విచారకరం. న్యాయ శాస్త్రానికి జవాబుదారీ బాధ్యత లేకపోతే దాని పర్యవసానాలు దీర్ఘకాలం ఉంటాయి. బాధితులకు న్యాయం జరిగేందుకు తగిన చర్యలు ఉండటం లేదు. సకాలంలో చర్యలు తీసుకుంటే అనేక మందికి భద్రత చేకూరుతుంది. ఉపహార్ విషాద ఘట్టం లాంటివి అనేక విధాలుగా కొనసాగుతూనే ఉన్నాయి.

ఇలాంటి విషాద ఘట్టాలను మరికొన్ని పరిశీలిద్దాం. 2018 జనవరిలో భవన పారిశ్రామిక ప్రాంతం భవనంలో పెద్దఎత్తున మంటలు చెలరేగి 17 మంది ప్రాణాలు కోల్పోగా, అనేక మందికి కాలిన గాయాలయ్యాయి. ఫ్యాక్టరీ యజమానిని అరెస్టు చేసి ఆ తర్వాత బెయిల్‌పై విడుదల చేశారు. ఉపహార్ విషాదాన్ని ఉదాహరణగా తీసుకుని మున్సిపల్ అధికారులు తగిన భద్రతా చర్యలు తీసుకొని ఉన్నట్లయితే, భవన పారిశ్రామిక ప్రాంత అగ్ని ప్రమాదం జరిగి ఉండేది కాదు. అయినా అధికారులు ఎలాంటి గుణపాఠాలు నేర్చుకోవడం లేదు. ఇది జరిగిన మరో ఏడాదికి జన సమ్మర్థం గల కరోల్‌బాగ్ ప్రాంతంలో హోటల్ అర్పిట్ ప్యాలెస్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 17 మంది ప్రాణాలు పోగా 35 మంది గాయపడ్డారు. ఇందులోను మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యమే చూపారు. వారి పైన ఎలాంటి చర్యలు లేవు. 2019 డిసెంబర్‌లో దిల్లీ సదర్ బజార్‌లోని అనాజ్ మండీలో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. ఈ విషాదంలోనూ 43 మంది మరణించగా 67 మంది గాయపడ్డారు. వీరంతా బిహార్, ఉత్తరప్రదేశ్ నుంచి వలస వచ్చి పనులు చేసుకుంటున్న వాళ్లే.

ఈ భవనం అక్రమ ఉత్పత్తుల యూనిట్లకు స్థావరం. భవనానికి అగ్ని మాపక శాఖ అనుమతి కూడా లేదు. ఇందులో మండే స్వభావం గల పదార్థాలు నిల్వ ఉన్నాయి. ఏదో ఒకరోజు విషాదం సంభవించే అవకాశం ఉన్నదనే భావన ముందుగానే ఉన్నది. బయటకు వెళ్లే మార్గాలను వివిధ పరికరాలతో నింపి వేశారు. అందువల్ల కార్మికులు మంటల నుండి తప్పించుకుని బయటపడే అవకాశం లేకపోయింది. కిటికీలన్నీ గట్టిగా మూసివేసి ఉన్నాయి. అందువల్ల హాని కలిగించే పొగ, కార్బన్ మోనాక్సైడ్ లోపలే ఉండిపోయి కార్మికులు వాటిని పీల్చుకుని ప్రాణాలు కోల్పోయారు. భవన యజమానులను వారికి సహకరించిన వారిని అరెస్టు చేసి ఆ తర్వాత వదిలేశారు. ఈ విషాదంలోను మున్సిపల్ అధికారుల పైన అగ్ని మాపక విభాగం అధికారులపైన ఎలాంటి చర్యలు లేవు. అనుమతులు లేకుండా ఇష్టం వచ్చిన ప్రమాదకర ఉత్పత్తులను తయారు చేస్తున్నప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా బహుశా లంచాలు తీసుకొని మౌనం దాల్చి ఉంటారు. ఈ విషాద ఘట్టాలకు సంబంధించి విద్యార్థి-యువత సంస్థ లోతుగా అధ్యయనం చేసి తమ నివేదికలో అధికారుల నేరపూరిత నిర్లక్ష్యం వల్లే ఇవి జరిగాయని నిర్ధారించారు. వాస్తవంగా ఎలాంటి అనుమతి లేని భారీ భవనాల నిర్మాణం సాగిపోతూనే ఉంది. చాటుమాటు వ్యవహారాలే ఇందుకు కారణం.

ఈ విషాద ఘట్టాలలో ముండ్క అగ్ని ప్రమాదం ఇటీవల జరిగింది. నాలుగు అంతస్థుల భవనంలో రెండు అంతస్థులలో వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేస్తుండగా ప్రమాదం జరిగి 27 మంది మరణించారు. ఇంత పెద్ద భవనంలో బయటకు వెళ్లే మార్గం ఒక్కటే ఉండటం ఏమిటి? ధనం, రాజకీయ పలుకుబడి ఇందులోనూ పనిచేశాయి. ఫ్యాక్టరీ యజమానిని అరెస్ట్ చేసి, బెయిల్‌పై విడుదల చేశారు. యజమాని తప్పించుకొని పారిపోయాడు. అక్రమ, అనుమతులు లేని నిర్మాణాలపై ఎలాంటి చర్యలు లేకపోవటం వలనే ఇలాంటి విషాదాలు జరుగుతున్నాయి. వీటిలో భాగంగా జహంగీర్ పురి ప్రాంతంలో ఏ ఆధారం లేని సామాన్యులపైన బుల్డోజర్ న్యాయాన్ని అమలు చేశారు. ఎలాంటి నోటీసులు, హెచ్చరికలు లేకుండానే బుల్డోజర్లు నడిపి పేదల నివాసాలను పూర్తిగా ధ్వంసం చేశారు. అక్రమ నిర్మాణాలకు పాల్పడిన సంపన్నులు, అధికార ఆశ్రితుల పైన ఇలాంటి చర్యలే అధికారులు తీసుకుంటారా? అంటే ఆచరణలో రెండు రకాల న్యాయాలు అమలు జరుగుతున్నాయని చెప్పవచ్చు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని కూల్చివేతలను నిలిపి వేయాలని ఉత్తర్వు చేసినప్పటికీ అధికారులు విధ్వంసకర, హృదయంలేని కార్యకలాపాలను కొనసాగించారు. నివాసాలు, ఇతర వస్తువులు కోల్పోయిన పేదలు తిరిగి తమ జీవితాలను ఎప్పటికి చక్కదిద్దుకోగలరు? అందరికీ ఒకే విధమైన న్యాయం ఎప్పటికైనా జరిగేనా? మన న్యాయ వ్యవస్థ ఈ విషయంలో లోతుగా ఆలోచించవలసిన సమయం ఇది. ఎలాంటి వనరులు, శక్తి, స్థోమత లేని సామాన్యులకు జీవన హక్కు, వ్యక్తిగత గోప్యత హక్కు రాజ్యాంగం కల్పించింది. వీటిని అమలు చేసే వాళ్లే కనిపించటం లేదు.

ఈ-మెయిల్

ప్రజలను అజ్ఞానులను చేయవద్దు

ప్రసారమాధ్యమాలైన టీవీలు, వార్తా పత్రికలు, రేడియోలు ప్రసారం చేసే కార్యక్రమాలు, వార్తలు ప్రజలపై ఎక్కువ ప్రభావాన్ని చూపుతాయి. ప్రసార మాధ్యమాలు ప్రజలకు సత్యాన్ని చెప్పాలి. వాస్తవాలను ప్రసారం చేయాలి. శాస్త్రీయ విజ్ఞానం ద్వారా టీవీలను, రేడియోలను, పత్రికలను మనిషి కనుగొన్నాడు. మరి ఈ రోజు అవి చేస్తున్నదేమిటి? అశాస్త్రీయమైన, అజ్ఞానంతో కూడిన, మూఢనమ్మకాలతో కూడిన కార్యక్రమాలను ప్రసారం చెయ్యటం చూస్తుంటే వాళ్లు సమాజాన్ని ఎటు తీసుకుపోతున్నారన్న అనుమానం వస్తుంది. టీవీలలో, రేడియోలలో పొద్దున్నే సుప్రభాతాలు, దొంగ బాబాల ఉపన్యాసాలు, రంగురాళ్లు చేతివేళ్ళకి ధరిస్తే లక్కు మారుతుంది, రుద్రాక్షలు ధరిస్తే జీవితాలు మారతాయి, పేరు మార్చుకుంటే అదృష్టం అని చెప్పే సంఖ్యా శాస్త్రాలు, వాస్తు జ్యోతిష్యము అంటూ ప్రజలను మరలా మధ్యయుగాల్లోకి తీసికెళ్ళే కుట్ర జరుగుతోంది. ప్రపంచంలో వాస్తుజ్యోతిష్యాలు నిజమనిగాని, రంగురాళ్లను ధరిస్తే జీవితాలు మారతాయనిగాని ఎక్కడా రుజువు కాలేదు. అవన్నీ అబద్ధం, అశాస్త్రీయం. కొంతమంది స్వాముల పేర్లతో టీవీలలో బోధనలు చేస్తుంటారు. వారంతా పూర్వాశ్రమంలో భూఆక్రమణదారులుగానో, సినిమాహాల్స్‌లో బ్లాక్ టికెట్లు అమ్ముకున్నవారో, బెజవాడ నగరంలో గతంలో చీటిపాటలు వేసి ఎగ్గొట్టి తన్నులు తిని పారిపోయిన శివస్వామిలాంటి వారో అయి ఉంటారు. మతబోధకుల మాటలువిని కొంతమంది మోక్షం కోసం, దేవుణ్ణి చూద్దామని ఉరి వేసుకోవటం, దిల్లీలో పదకొండు మంది ఆత్మహత్య చేసుకోవటం, మదనపల్లి జంటహత్యలలాగా పిల్లల్ని చంపుకోవటం, ఇలాంటి పరలోకాన్ని ప్రేమిద్దామని బోధించేవారిపైన చర్యలు లేనందున వీరి బోధనలు విని జనం చచ్చిపోతున్నారు.

కొంతమంది యుగాంతం జరుగుతుందని, కాలసర్ప దోషముందని నమ్మించి, ఆవునెయ్యితో సూర్యునికి పూజలు చేస్తే కరోనా మటుమాయమవుతుందని చేప్పే స్వాములు, అష్టగ్రహ కూటమో పంచ గ్రహ కూటమో వచ్చినందున కరోనా వచ్చిందని చెప్పే స్వరూపానందలూ వీరంతా ప్రజలను అజ్ఞానంలోకి, అంధకారంలోకి తీసికెళ్లే విధంగా బోధిస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు. దినపత్రికలలో, వార్తాపత్రికలలో దినఫలాలు, వార ఫలాలు వేస్తుంటారు. జ్యోతిష్యం నిజమని ప్రపంచంలో ఇంతవరకు ఋజువు కాలేదు. మరి ఎవరిని అజ్ఞానులుగా చెయ్యటానికి ఈ దిన వార ఫలాలు? ఇప్పటికైనా టీవీలు, వార్తాపత్రికలు, రేడియోలూ రంగురాళ్లను, రుద్రాక్షలను సంఖ్యాశాస్త్రాలను, వాస్తుజ్యోతిష్యాలను, దొంగస్వాముల ప్రవచనా లను ప్రసారం చెయ్యటం, ప్రచురించటం మానుకొని సమాజాన్ని ముందుకు తీసుకుపోవటంలో భాగస్వామ్యం కావాలి.

నార్నె వెంకట సుబ్బయ్య
హేతువాద సంఘం.

గ్రామీణ ఉపాధిని హరించే యంత్ర సేవా పథకం!

బొల్లిముంత సాంబశివరావు

వ్యవసాయ యాంత్రీకరణ లక్ష్యంగా జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం వైయస్ఆర్ యంత్ర సేవా పథకాన్ని ప్రవేశ పెట్టింది. వారం క్రితం ఈ నెల 7న గుంటూరు చుట్టుగుంట సెంటర్ నుండి జగన్ ఈ పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఈ పథకం వలన రైతాంగానికి సేద్యపు ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని చెప్పారు. యంత్ర సేవా పథకం ఎవరి ప్రయోజనాల కోసం ప్రవేశ పెట్టారు? ఇది చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగకరమా? నేటి వ్యవసాయ రంగానికి యంత్ర సేద్యం అవసరమా? దీనివల్ల గ్రామీణ పేదల ఉపాధి పరిస్థితి ఏమిటి అన్న విషయాలు ముందుకు వస్తున్నాయి. ఇవి చర్చించాల్సిన విషయాలు.

వైయస్ఆర్ యంత్ర సేవా పథకం ద్వారా సబ్సిడీకి రైతు సంఘాలు (గ్రూపులు) కొనుగోలు చేయవచ్చునని, రైతు భరోసా కేంద్రాల వద్దే తక్కువ అద్దెకు సాగు యంత్రాలు, పనిముట్లు అందుబాటులో ఉంచుతామని, విత్తనం దగ్గర నుంచి కోత వరకు అవసరమైన పరికరాలను అందించటానికి, తద్వారా పెట్టుబడి ఖర్చు తగ్గించి రైతులకు ఎక్కువ రాబడి అందించేందుకు 2,016 కోట్ల వ్యయంతో ఆర్బీకే స్థాయిలో ఒక్కొక్కటి 15 లక్షల విలువ గల 10,750 వైయస్ఆర్ యంత్ర సేవా కేంద్రాలు, వరి ఎక్కువగా పండే జిల్లాల్లో ఒక్కొక్కటి 25 లక్షల విలువ గల కంబైన్ హార్వెస్టర్లతో కూడిన 1,615 క్లస్టర్ స్థాయి ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. గుంటూరు చుట్టుగుంట నుండి ఏలూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల రైతు సంఘాలకు 1204 ట్రాక్టర్లు, 75 కంబైన్డ్ హార్వెస్టర్లు ఇచ్చినట్లు ప్రకటించారు. ఇంతకు ముందు రాష్ట్ర వ్యాపితంగా 6,780 ఆర్బీకేలకు, 391 క్లస్టర్ స్థాయి కేంద్రాలకు 700 కోట్ల విలువైన ట్రాక్టర్లు, హార్వెస్టర్లను పంపిణీ చేసినట్లు చెప్పారు. యంత్ర సేవా పథకం సబ్సిడీ కోసం 806 కోట్లు ప్రకటించినట్లు ప్రభుత్వం చెబుతున్నది. రాష్ట్ర ప్రభుత్వ ప్రచార తీరు చూస్తే సేద్యం పండగే అన్న భావన, రైతాంగం కష్టాలు తీరతాయనే భావన కలుగుతుంది. నిజానికి ఇది రైతాంగానికి అత్యంత ప్రమాదకరం. వేలాది రైతు సంఘాలు ఎప్పుడు ఏర్పడ్డాయి, అందులో ప్రతినిధులు ఎవరు అన్నది రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రమే తెలుసు. చిన్న, సన్న కారు రైతులు ఈ సంఘాల్లో పేరుకు కూడా సభ్యులు కాదు. పంటలను బట్టి అవసరమైన యంత్ర పరికరాలను ఎంపిక చేసుకోవటంలో రైతు గ్రూపులదే తుది నిర్ణయమని, రైతాంగానికి పెట్టుబడి భారం లేకుండా రైతు గ్రూపులకు 40% రాయితీతో యంత్రాలు, పనిముట్ల సరఫరా ఆప్కాబ్, డిసిసిబి ద్వారా పరికరాల ఖరీదులో 50% రుణం తక్కువ వడ్డీకే అందించటం జరుగుతుందని, రైతు సంఘం 10% చెల్లిస్తే చాలని చెబుతున్నారు.

మనది వ్యవసాయ దేశం. రాష్ట్రంలో గ్రామీణ పేదలకు ప్రధాన ఉపాధి రంగం వ్యవసాయం. నూటికి 68% ప్రజలు ఇప్పటికీ వ్యవసాయం మీద ఆధారపడి గ్రామీణ ప్రాంతంలో నివసిస్తున్నారు. కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో మార్పులు చోటు చేసుకుంటాయి. అలాగే రాష్ట్రంలోనూ కొన్ని మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రపంచీకరణ విధానాల ఫలితంగా మిగులు ఆదాయం పెరగక కుటుంబ మనుగడ కష్టసాధ్యంగా మారింది. అధిక దిగుబడి కోసం రసాయనిక ఎరువుల వాడకం ప్రారంభమై అవి వినియోగించకపోతే పంట దిగుబడులు రాని పరిస్థితి రైతుకు ఏర్పడింది. పత్తి, చెరుకు, పసుపు, మిర్చి లాంటి వాణిజ్య పంటలు కూడా సేద్యంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయి. రైతాంగానికి పంటపై వచ్చే ఆదాయమే కుటుంబ పోషణకు పునాదిగా ఉంది. అలాగే కూలీలకు వ్యవసాయ పనుల ద్వారా వచ్చే ఆదాయం జీవనాధారంగా ఉంది. వ్యవసాయ ఆధారంగా పశు పోషణ ఉండేది. వ్యవసాయ రంగ ప్రాముఖ్యత అలాంటిది.

దేశీయ వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టి తమపై ఆధారపడేలా చేసుకోవటానికి సామ్రాజ్యవాదులు, ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదులు భారత పాలకులపై ఒత్తిడి చేసిన ఫలితంగా దేశంలో సరళీకరణ విధానాల అమలు, ప్రపంచ వాణిజ్య ఒప్పందంపై సంతకం, ప్రపంచ వ్యవసాయ ఒప్పందానికి ఆమోదం జరిగాయి. వీటి ఫలితంగా మన వ్యవసాయ రంగం తిరోగమించటం ప్రారంభమైంది. ఎరువుల, విత్తనాల, పురుగు మందుల ధరలు పెరిగి సేద్యపు ఖర్చులు పెరుగుతూ ఉండటం, పంటలకు లాభసాటి ధరలు లభించకపోవటం పంటలు అమ్ముకోవటమే గగనం కావడం, సేద్యం నష్టదాయకంగా మారి రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోవడంతో బలవన్మరణాలకు పాల్పడే పరిస్థితి ఏర్పడింది.

సామ్రాజ్యవాదుల ప్రయోజనాలే ముఖ్యం అనుకొంటున్న దేశీయ పాలకులు రైతాంగం ఎదుర్కొంటున్న మౌలిక సమస్యల పరిష్కారానికి ప్రయత్నించకపోగా సంక్షోభాన్ని పెంచే విధానాలు అమలు జరుపుతున్నారు. పియం కిసాన్ సమ్మాన్ యోజన, పంటల బీమా పథకం, కిసాన్ క్రెడిట్ కార్డు పథకాల పేరుతో మోదీ ప్రభుత్వం, వైయస్ఆర్ రైతు భరోసా, పంటల కొనుగోలు నిధి, యంత్ర సేవా పథకం పేర్లతో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం రైతాంగాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నాయి. రైతు ప్రయోజనాల పేరుతో విదేశీ బీమా సంస్థల దోపిడీకి, రైతులకు బ్యాంకులు ఇచ్చే అప్పులకు గ్యారంటీగా పంటల బీమా పథకాన్ని మోదీ ప్రభుత్వం అమలు జరుపుతున్నది. కిసాన్ క్రెడిట్ కార్డుల పేరుతో ధనిక రైతులకు, భూస్వాములకు లక్షలాది రూపాయలు కట్టపెడుతున్నది. ఈ పథకాల వలన చిన్న, సన్న కారు రైతులకు ఎలాంటి ప్రయోజనం కలగటం లేదు. రైతాంగం ఎదుర్కొంటున్న కీలక సమస్య పంటలకు న్యాయమైన మద్దతు ధర, దానికి చట్టబద్ధత. ఈ అంశాన్ని తెలివిగా ఆచరణలో వ్యతిరేకిస్తున్నది. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం కూడా మద్దతు ధరలు, చట్టబద్ధతపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయకుండా రాజీ పడుతున్నది. రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన ఎరువులు, విత్తనాలు రైతులకు అందిస్తున్నట్లు ఊదరకొడుతున్నది. ఏవో కొద్ది కేంద్రాల్లో తప్పితే ఇవి రైతులకు అందటం లేదు. ఇప్పుడు యంత్ర సేవా పథకం ద్వారా రైతాంగానికి పంట ఖర్చులు తగ్గించి ఆదాయం పెరిగేలా చేస్తాను అంటున్నది. ఈ యంత్రాలన్నీ విదేశీ కంపెనీల నుండి కొనుగోలు చేయటం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వాటికి లబ్ధి చేకూరుస్తున్నది. ప్రభుత్వం అందించే యంత్రాలన్నీ రైతు గ్రూపుల పేరుతో ధనిక రైతులకే దక్కుతాయి. వీటిని చిన్న, సన్న కారు రైతుల వ్యవసాయ పనులకు వాటి అద్దె నిర్ణయించి పెద్ద ఎత్తున ఆదాయం పొందుతారు. పేద, మధ్య తరగతి రైతులకు ఖర్చులు ఏ మాత్రం తగ్గవు. వీరికి యంత్రాలు కొనే ఆర్థిక స్తోమత ఉండదు. ఈ పథకం విదేశీ కంపెనీలకు, ధనిక, భూస్వామ్య వర్గాల ప్రయోజనం కోసం ఏర్పాటు చేసిందే. అందుకు వేల కోట్లు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నది. ఈ ధనం ద్వారా వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేస్తే రైతాంగానికి, గ్రామీణ పేదలకు ప్రయోజనకరంగా ఉండేది.

సరళీకృత ఆర్థిక విధానాలు, ప్రపంచ వాణిజ్య ఒప్పందం ఫలితంగా గ్రామీణ పేదలకు ఉపాధి తరిగిపోతోంది. 1980 వరకు 120 రోజులు దొరికిన ఉపాధి నేడు 60 రోజులకు చేరింది. కొన్ని ప్రాంతాల్లో 20 రోజులకు మించి గ్రామీణ పేదలకు ఉపాధి దొరకటం లేదు. అవసరానికి మించి వ్యవసాయంలో యంత్రాల వినియోగమే అందుకు కారణం. యంత్ర సేవా పథకం వలన నామమాత్రంగా ఉన్న ఉపాధి కూడా పేదలకు దొరకదు. ఉపాధి దొరకని గ్రామీణ పేదలు పట్టణాలకు వలస వెళ్లి దుర్భర జీవితాలు గడుపుతున్న వారి జాబితాలో చేరతారు. పారిశ్రామికాభివృద్ధి జరిగిన ప్రాంతాల్లో వ్యవసాయంలోనూ యంత్రాల వినియోగం పెరుగుతుంది కానీ ఇందుకు విరుద్ధమైన పరిస్థితుల్లో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం దీనిని అమలు జరప పూనుకొన్నది. ఇది రైతాంగానికి, గ్రామీణ పేదలకు నష్టదాయకం. అవసరం లేని వ్యవసాయ యాంత్రీకరణను వ్యతిరేకిస్తూ, పంటలకు న్యాయమైన మద్దతు ధరలు, చట్టబద్ధత కల్పించాలని, ఎరువులపై సబ్సిడీ పెంచాలని రైతాంగం, గ్రామీణ పేదలు ఉద్యమించాలి.

వ్యాస రచయిత సెల్ 9885983526

దేశీయంగా 96 యుద్ధ విమానాల తయారీ

- విదేశాల నుంచి మరో 18 దిగుమతి
- సామర్థ్యం పెంపునకు ఐఏఎఫ్ 'ఆత్మనిర్భర్' నిర్ణయం
- మొత్తం 114 ఫైటర్ జెట్ల సేకరణకు కసరత్తు

న్యూఢిల్లీ: దేశీయంగా 96 కొత్త యుద్ధ విమానాలను తయారు చేయాలని భారతీయ వైమానిక దళం (ఐఏఎఫ్) నిర్ణయించింది. మరో 18 యుద్ధ విమానాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాలని యోచిస్తుంది.ఆత్మనిర్భర్ భారత్ పథకం క్రమంలో 114 ఐఏఎఫ్ ఫైటర్ జెట్ల సేకరణకు కసరత్తు జరుగుతోందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 114కుగాను 96 విమానాలను దేశీయంగా తయారు చేసుకొని 18ని విదేశాల నుంచి తెప్పించుకోవాలని ఐఏఎఫ్ యోచిస్తున్నట్లు పేర్కొన్నాయి. 'బయ్ గ్లోబల్ అండ్ మేక్ ఇన్ ఇండియా' క్రమంలో 114 మల్టీరోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎంఆర్ఎఫ్ఏ)ల సేకరించాలని ఐఏఎఫ్ భావిస్తోంది. ఇదే విషయమై విదేశీ వరక్తలతో సమావేశాలను వైమానిక దళం నిర్వహించిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రణాళిక ప్రకారం తొలుత 18 విమానాలను దిగుమతి చేసుకొని.. తర్వాత 36 విమానాలను దేశంలో తయారు చేస్తారు. చెల్లింపులు పాక్షికంగా విదేశీ - భారతీయ కరెన్సీలలో జరుగుతుంది. చివరగా 60 విమానాలను తయారు చేసే ప్రధాన బాధ్యత భారతీయ భాగస్వామిపై ఉంటుందని, ప్రభుత్వం రూపాయల్లోనే చెల్లింపులు చేస్తుందని వర్గాలు పేర్కొన్నాయి. భారతీయ కరెన్సీలో చెల్లింపులు చేయడం ద్వారా 'మేకిన్ ఇండియా' ప్రాజెక్టులో 60శాతం పొందేందుకు విక్రేతలకు అవకాశం ఉంటుందని వెల్లడించాయి. అంతర్జాతీయ వైమానిక సంస్థలు బోయింగ్, లాక్‌హీడ్ మార్టిన్, సాబ్, మిగ్, ఇర్కుట్ కార్పొరేషన్, దసాల్ట్ ఏవియేషన్.. టెండర్‌లు వేస్తాయన్న అంచనా ఉంది. కాగా, పక్క దేశాలైన పాకిస్థాన్, చైనా మీద ఆధిపత్యం కోసం కొత్త 114 ఫైటర్ జెట్లపైనే ఐఏఎఫ్ అమితంగా ఆధారపడాల్సి ఉంటుంది. 2020లో లడఖ్ సంక్షోభమప్పుడు 36 రఫేల్ విమానాలు ఉపయోగపడ్డాయి. అయితే అవి సరిపోవు.. మరిన్ని విమానాల అవసరం ఐఏఎఫ్‌కు ఉంది. దీంతో 83 ఎల్‌సీఏ ఎంకే 1ఏ విమానాల కోసం ఇప్పటికే ఐఏఎఫ్ ఆర్డర్లు ఇచ్చింది. మిగ్ సిరీస్ విమానాలు కాలం చెల్లిపోతుండటంతో మరిన్ని యుద్ధ విమానాల అవసరం వైమానిక దళానికి ఏర్పడింది. ఐదవ తరం ఆధునిక మధ్యశ్రేణి యుద్ధ విమానాల ప్రాజెక్టు సాగుతున్న గతి సంతృప్తికరంగానే ఉన్నప్పటికి ఇది పూర్తి అయ్యేందుకు, ఆ విమానాలు అమ్ములపొదికి చేరడానికి చాలా సమయం పడుతుంది. యుద్ధ విమానాల అవసరాన్ని తీర్చుకోవడంతో పాటు వ్యయాన్ని తగ్గించే ప్రయత్నాలను ఐఏఎఫ్ చేస్తోంది. నిర్వహణ వ్యయం తక్కువగా ఉండి ఎక్కువ సామర్థ్యం ఉండే విమానాలను కోరుకుంటోంది. ఈ క్రమంలో రాఫెల్ పనితీరుపై ఐఏఎఫ్ సంతృప్తికరంగా ఉంది. భవిష్యత్‌లోనూ ఇదే తరహా విమానాలను కోరుకుంటోంది.

దేశంలో 8 వేలకుపైగా కరోనా కేసులు

న్యూఢిల్లీ: దేశంలో కోవిడ్-19 కేసులు స్వల్పంగా తగ్గాయి. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు 8,084 మంది వైరస్ బారిన పడ్డారు. మహమ్మారి కారణంగా మరో10 మంది ప్రాణాలు కోల్పోయారు. కాగా ఒక్క రోజులో 4,592 మంది కోలుకున్నారు. దీంతో మొత్తం కోలుకున్నవారి సంఖ్య 98.68 శాతానికి చేరింది. మృతుల సంఖ్య 1.21 శాతంగా ఉంది. అయితే మొత్తం కేసుల్లో క్రియాశీల కేసుల సంఖ్య 0.10 శాతం వద్ద ఉంది. రోజువారీ పాజిటివిటీ రేటు 3.24 శాతంగా నమోదైంది. ఇప్పటివరకు దేశంలో మొత్తం కరోనా కేసులు: 4,32,22,861 కాగా, మరణాలు: 5,24,771, క్రియాశీల కేసులు: 47,995, కోలుకున్నవారి సంఖ్య: 4,26,57,335. ఇక గడచిన 24గంటల్లో 11,77,146 మందికి కోవిడ్ వాక్సిన్ డోసులు అందించగా.. ఇప్పటివరకు పంపిణీ చేసిన వాక్సిన్ డోసుల సంఖ్య 1,95,19,81,150కు చేరింది. మరో 2,49,418 మందికి కరోనా టెస్టులు నిర్వహించారు. ఈ మేరకు కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ ప్రకటించింది.

అర్హులందరూ రక్తదానం చేయాలి: డబ్ల్యూహెచ్ఓ

న్యూఢిల్లీ: ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని (జూన్ 14) పురస్కరించుకుని ప్రపంచ దేశాల్లోని అర్హులైన వ్యక్తులంతా ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా క్రమం తప్పకుండా, స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని ప్రపంచ ఆరోగ్యసంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సోమవారం అభ్యర్థించింది. డబ్ల్యూహెచ్ఓ ఆగ్నేయాసియా ప్రాంత రీజినల్ డైరెక్టర్ డా. ఖేత్రపాల్ సింగ్ మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా 118.5 మిలియన్ల రక్తదానాలు సేకరించబడుతున్నాయని అంచనా వేయగా, వీటిలో దాదాపు 40 శాతం... ప్రపంచ జనాభాలో కేవలం 16 శాతం ఉన్న అధిక ఆదాయ దేశాల నుండి సేకరించబడినట్లు వెల్లడించారు. తక్కువ ఆదాయ దేశాలలో ఐదేళ్లలోపు పిల్లలకు ఎక్కువ రక్తమార్పిడులు జరుగుతుంటాయి. దాతలు క్రమం తప్పకుండా స్వచ్ఛందంగా రక్తదానం చేయడం... అలాగే గర్భధారణ సంబంధిత సమస్యలను నిర్వహించడానికి, మాతా, నవజాత శిశు మరణాలను నిరోధించడంలో కీలక సాధనంగా ఉంటుందని పేర్కొన్నారు.

పంకజాముండే మద్దతుదారు అరెస్టు

ఔరంగాబాద్: మహారాష్ట్ర మాజీమంత్రి పంకజా ముండేను రాష్ట్ర శాసనమండలికి జరగనున్న ఎన్నికలకు నామినేట్ చేయకూడదన్న పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఔరంగాబాద్‌లోని బీజేపీ ఎంపీ భగవత్ కరద్ కార్యాలయం ఎదుట పంకజా ముండే మద్దతుదారు సచిన్ దోయిఫోడ్ తన అనుచరులతో కలిసి ఆదివారం నిరసన తెలిపారు. ముండేకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తర్వాత పోలీసులు దోయిఫోడ్‌ను, అదుపులోకి తీసుకున్నారని, ఆయన మద్యం మత్తులో ఉన్నట్లు తేలిందని సోమవారం ఓ అధికారి తెలిపారు. మహారాష్ట్ర పోలీసు చట్టంలోని సెక్షన్ 135 కింద దోయిఫోడ్, మరొక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. దోయిఫోడ్‌కు నోటీసు ఇచ్చి, విడుదల చేసినట్లు అధికారి తెలిపారు. కాగా పోలీసులు దోయిఫోడ్‌ను అదుపులోకి తీసుకుంటుండగా, ఐదు నుండి ఎనిమిది మంది గుర్తుతెలియని వ్యక్తులు అతనిని తీవ్రంగా కొట్టారని ఆరోపించారు. పోలీసులు వారిపై కూడా కేసులు నమోదు చేసినట్లు అధికారి వెల్లడించారు. మహారాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్‌లోని 10 స్థానాలకు జరగనున్న ఎన్నికలకు బీజేపీ ఆరుగురు అభ్యర్థులను ప్రకటించింది, అయితే బీజేపీ అగ్రనేత దివంగత గోపీనాథ్ ముండే కుమార్తె పంకజా ముండే పేరు జాబితాలో లేకపోవడంపై ఆమె మద్దతుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గాంధీ ఆస్తుల్ని కాపాడేందుకే ఆ నిరసనలు

స్మృతి ఇరానీ ఆరోపణ

న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసులో సోమవారం ఈడీ ముందు హాజరయ్యేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ భారీ ర్యాలీతో వెళ్లడాన్ని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ తీవ్రంగా తప్పుపట్టారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు కాంగ్రెస్ ధర్నా చేయడం లేదని, రాహుల్ గాంధీకి చెందిన రెండు వేల కోట్ల ఆస్తుల్ని కాపాడేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆమె ఆరోపించారు. నిరసన ప్రదర్శనలతో దర్యాప్తు సంస్థపై ఒత్తిడి చేస్తున్నారన్నారు. అక్రమ ఆస్తుల్ని కాపాడుకునేందుకు దర్యాప్తు సంస్థపై కాంగ్రెస్ పార్టీ ఒత్తిడి తెస్తోందని, చట్టం కన్నా ఎవరూ గొప్ప కాదు అని, అందులో రాహుల్ గాంధీకి మినహాయింపులేదని మంత్రి అన్నారు. గాంధీ కుటుంబంపై ఉన్న ఈడీ కేసు గురించి మీడియాకు ఆమె వివరించారు.

నూపూర్‌శర్మ అనుచిత వ్యాఖ్యలతో

భారత్‌పై సైబర్ దాడులు

న్యూఢిల్లీ: బీజేపీ నేత నూపూర్ శర్మ మహ్మద్ ప్రవక్తపై చేసిన అనుచిత వ్యాఖ్యల ప్రభావంతో భారత్‌పై సైబర్ దాడులు ప్రారంభమయ్యాయి. ఈ వ్యాఖ్యలను ఖండిస్తూ ముస్లిం దేశాలు భారత రాయబారులకు సమన్లు జారీ చేశాయి. భారత్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని అల్ ఖైదా ఉగ్రవాద సంస్థ హెచ్చరించింది. తాజాగా భారత్‌లోని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలపై సైబర్ దాడులు జరుగుతున్నాయి. కురుదేశ్ కోరడ్స్ పేరుతో ఈ దాడులు జరిగినట్లు అధికారులు గుర్తించారు. హ్యాక్టివిస్ట్ గ్రూప్ డ్రాగన్‌ఫోర్స్ మలేషియా దాడులు నిర్వహించింది. ఇతర ఆన్‌లైన్ ప్లాట్‌ఫారాలలో ఇజ్రాయెల్‌లోని భారత రాయబార కార్యాలయం, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఈ-పోర్టల్‌ను లక్ష్యంగా చేసుకున్నాయి. మొత్తంగా భారత వెబ్‌సైట్లపై సైబర్ దాడులు జరిగాయని అధికారులు స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా పోర్టల్స్‌తో సహా 70 వెబ్‌సైట్లను హ్యాక్ చేశారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ భవన్‌లు, దేశవ్యాప్తంగా ఉన్న ఇతర విద్యా సంస్థలను కూడా వదిలిపెట్టలేదు. ఒక్క మహారాష్ట్రలోనే 50కి పైగా వెబ్‌సైట్‌లు ధ్వంసమైనట్లు గుర్తించారు. మీ కోసం మీ మతం నాకు నా మతం అంటూ ఆడియో క్లిప్‌లు, టెక్స్టల ద్వారా ఒక సందేశాన్ని పంపారు. ముస్లిం హ్యాకర్లు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న హ్యాకర్లు, మానవ హక్కుల సంస్థలు, కార్యకర్తలు భారతదేశానికి వ్యతిరేకంగా ప్రచారాన్ని ప్రారంభించాలని కూడా ఈ సందేశంలో పిలుపునిచ్చారు.

హైదరాబాద్‌కు చెందిన అగ్రిటెక్ కంపెనీలపై సైబర్ దాడులు జరిగినట్టు గుర్తించారు. ఇజ్రాయెల్‌లోని భారత రాయబార కార్యాలయ వెబ్‌సైట్‌ను ఆదివారం నాటికి భారత అధికారులు పునరుద్ధరించ గలిగారు. అయితే ఐసీఏఆర్ పేజీలలో ఒకటి ఇప్పటికీ పునరుద్ధరించలేకపోయినట్లుగా తెలిసింది. జూన్ 8 నుండి 12 మధ్య భారత ప్రభుత్వ వెబ్‌సైట్లు, ప్రైవేట్ పోర్టల్లపై సైబర్ దాడి జరిగినట్లు నిపుణులు నిర్ధారించారు.

బుల్డోజర్లు ఒక్కటే తక్కువయ్యాయి

కాంగ్రెస్ కార్యాలయం వద్ద భారీ భద్రతపై కార్తీ చిదంబరం

న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఈడీ ఎదుట హాజరవుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం వద్ద భారీ భద్రత ఏర్పాట్లు చేపట్టడంపై ఆ పార్టీ నేత కార్తీ చిదంబరం విస్మయం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కార్యాలయానికి వెళ్లే దారిలో పెద్ద ఎత్తున పోలీసు బలగాలను, బారికేడ్లను ఏర్పాటు చేశారని బుల్డోజర్లు ఒక్కటే తక్కువయ్యాయని వ్యాఖ్యానించారు. మైనారిటీ మతాన్ని ఆచరించే వ్యక్తులను, ఇళ్లను ధ్వంసం చేసే పనిలో బుల్డోజర్లు ఖాళీలేకుండా ఉండి ఉంటాయని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఈడీ విచారణకు భారీ ప్రదర్శగా హాజరయ్యేందుకు సన్నద్ధమవగా ఢిల్లీ పోలీసులు అక్బర్ రోడ్‌లోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద 144వ సెక్షన్‌ను విధించారు. ఇదే కేసులో జూన్ 23న విచారణకు హాజరు కావాలని కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీకి కూడా ఈడీ సమన్లు జారీ చేసింది. మైనారిటీ మతాన్ని విశ్వసించే వారి ఇళ్లు, జీవితాలను ధ్వంసం చేసే పనిలో తీరికలేకుండా ఉండటంతోనే వాటిని కాంగ్రెస్ కార్యాలయం వద్దకు తీసుకురాలేదని కార్తీ చిదంబరం ట్వీట్ చేశారు. కాషాయ నేతల విద్వేష వ్యాఖ్యలకు నిరసనగా జూన్ 10న ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన హింసాత్మక ఘటనల సూత్రధారి ఇంటిని ప్రయాగరాజ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీడీఏ) కూల్చివేసిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. షహరన్‌పూర్‌లో శుక్రవారం రాళ్ల దాడికి పాల్పడిన ఇద్దరు నిందితుల ఇళ్లను సైతం యూపీ పోలీసులు బుల్డోజర్లతో కూల్చివేశారు.

ఒక్కరోజు బెయిల్ ఇవ్వండి

హైకోర్టును ఆశ్రయించిన అనిల్ దేశ్‌ముఖ్

ముంబై: మనీలాండరింగ్ ఆరోపణలపై విచారణ ఎదుర్కొంటూ ప్రస్తుతం జైలులో ఉన్న మహారాష్ట్ర మాజీ హోంమంత్రి అనిల్ దేశ్‌ముఖ్ ఒకరోజు బెయిల్ మంజూరు చేయాల్సిందిగా కోరుతూ సోమవారం బాంబే హైకోర్టును ఆశ్రయించారు. రాష్ట్ర శాసన మండలి ఎన్నికల్లో ఓటు వేయడానికని జూన్ 20న ఒక రోజు తనను విడుదల చేయాల్సిందిగా ఆయన కోర్టుకు విన్నవించారు. ఎన్సీపీ నేత దేశ్‌ముఖ్... ఈ ఏడాది ప్రారంభంలో దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌లో భాగంగా ఈ దరఖాస్తు చేశారు. ఆయన న్యాయవాది ఇందర్‌పాల్‌సింగ్ జస్టిస్ ఎన్‌జే జమాదార్ నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట ఈ మేరకు దరఖాస్తును సమర్పించారు. కాగా కోర్టు దీనిపై విచారణను జూన్ 15వ తేదీకి వాయిదా వేసింది. జూన్ 10న రాజ్యసభ ఎన్నికల్లో ఓటు వేయడానికి దేశ్‌ముఖ్‌ను విడుదల చేయాలని ఇటీవల ఎన్సీపీ ప్రత్యేక న్యాయస్థానాన్ని అనుమతిని కోరగా, నిరాకరించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గత ఏడాది నవంబర్ 2న దేశ్‌ముఖ్‌ను అరెస్టు చేయగా, ప్రస్తుతం ఆయన జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. మహారాష్ట్ర శాసనమండలిలో 10 స్థానాలకు జూన్ 20న ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రంలో అధికారాన్ని పంచుకుంటున్న శివసేన, ఎన్సీపీ, కాంగ్రెస్‌లు ఇద్దరు చొప్పున అభ్యర్థులను ప్రతిపాదించగా, ప్రతిపక్ష బీజేపీ ఆరుగురు అభ్యర్థులను ఎమ్మెల్సీ ఎన్నికలకు బరిలోకి దింపింది.

బీజేపీపై పోరులో రాజీపడం

ఇదే సోనియా, రాహుల్ సందేశం: గెహ్లాట్

న్యూఢిల్లీ: మోదీ సర్కారుపై సైద్ధాంతిక పోరాటంలో రాజీపడే ప్రసక్తేలేదని కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ, ఆమె కుమారుడు రాహుల్‌గాంధీ స్పష్టమైన సంకేతాలిచ్చారని రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ చెప్పారు. ప్రధాని నరేంద్రమోదీ అహంకారానికి రోజులు దగ్గరపడ్డాయని ఆయన పేర్కొన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను పాలక బీజేపీ దుర్వినియోగం చేస్తోందని ఆ రాష్ట్ర మాజీ డిప్యూటీ సీఎం సచిన్ పైలెట్ విమర్శించారు. సోనియా, రాహుల్‌పై ఆరేడు ఏళ్ల నాటి కేసులను తిరగతోడుతున్నారని, రాజకీయ ప్రత్యర్థులపై ఒత్తిడికి ఇదే నిదర్శనమని ఆయన తెలిపారు. మనీలాండరింగ్ కేసులో రాహుల్‌గాంధీని ఈడీ ప్రశ్నించడానికి నిరసనగా సోమవారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు దేశ వ్యాప్తంగా ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో అశోక్‌గెహ్లాట్, సచిన్ పైలెట్ ఈ వ్యాఖ్యలు చేశారు. అశోక్ గెహ్లాట్ విలేకరులతో మాట్లాడుతూ 'మేము రాజీపడే ప్రసక్తేలేదని సోనియా, రాహుల్‌గాంధీ దేశానికి స్పష్టమైన సంకేతాలు పంపారు. సిద్ధాంతపరంగా మేము పోరాడతాం. సీబీఐ, ఐటీ, ఈడీ, డీఆర్ఐ, న్యాయవ్యవస్థపై విపరీత ఒత్తిళ్లు పని చేస్తున్నాయి. పొరపాటున ఎవరైనా నిజాయతీగా ఉంటే వారికి చుక్కలే' అని చెప్పారు. 'దేశాన్ని ఎటు తీసుకెళుతున్నామో ప్రతిభారతీయుడు ఆలోచించే సమయం ఆసన్నమైంది. బీజేపీ దేశమంతా కిరోసిన్ పోసి తగలబెడుతోందని రాహుల్‌గాంధీ లండన్‌లో చెప్పారు. ఇక్కడేమి జరుగు తుందో మీరు ఇప్పుడు చూస్తున్నారు. అల్లర్లు జరుగుతున్నాయి. అల్లర్లు సృష్టిస్తున్నారు...ప్రోత్సహిస్తున్నారు. ఉద్రిక్తతలు పెంచుతున్నారు' అని బీజేపీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 'ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అహంకారం ప్రదర్శిస్తున్నారు. అహంకారం ఎంతోకాలం సాగదు. ఈరోజు కాకపోతే రేపైనా అది దిగకతప్పదు' అని హెచ్చరించారు.

బెంగాల్‌లో ఆగని ఆందోళనలు

అదుపులోనే ఉందన్న డీజీపీ

కోల్‌కతా: మహ్మద్ ప్రవక్తపై వివాదాస్పద వ్యాఖ్యలకు సంబంధించి పశ్చిబెంగాల్‌లో చెలరేగిన హింసాత్మక అల్లర్లు అదుపులోకి వచ్చాయని డీజీపీ మనోజ్ మాలవీయ సోమ వారం చెప్పారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికే 42 కేసులు నమోదయ్యాయని, 200 మందిని అరెస్టు చేసినట్లు చెప్పారు. ఇప్పటి వరకు పరిస్థితి అదుపులోనే ఉందని మాలవీయ విలేకరులకు వెల్లడించారు. మహ్మద్ ప్రవక్తకు వ్యతిరేకంగా బీజేపీ నేతలు నూపుర్ శర్మ, నవీన్ కుమార్ జిందాల్ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో అల్లర్లు చెలరేగిన విషయం విదితమే. మరోవైపు, అక్కడక్కడా స్వల్ప ఘటనలు మినహా రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని అధికారులు తెలిపారు. అల్లర్లు చెలరేగిన ప్రాంతాల్లో పోలీసులను మోహరించామని చెప్పారు. ఆందోళ నకారులు రైల్వే ట్రాక్‌లను దిగ్బంధించడంతో సీల్దా-హస్నాబాద్ సెక్షన్‌లో రైలు సర్వీసులకు అంతరాయం ఏర్పడి నట్లు వివరించారు. రైల్వే ట్రాక్‌లపై బీజేపీ నేతల నూపుర్‌శర్మ దిష్టిబొమ్మలు దహనం చేశారు. టైర్లకు నిప్పంటించారు. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు భారీగా పోలీసులను రంగంలోకి దించారు. ముందుజాగ్రత్త చర్యగా 144 సెక్షన్‌ను అమలు చేశారు. 25 మందిని అరెస్టు చేశారు. స్థానిక వ్యాపారులు సైతం 72 గంటల బంద్‌కు పిలుపునిచ్చారు.

ఒడిశా స్పీకర్‌గా విక్రమ్ కేశరీ అరుఖా

భువనేశ్వర్: ఒడిశా అసెంబ్లీ స్పీకర్‌గా ఆరుసార్లు బీజేడీ ఎమ్మెల్యేగా ఎన్నికైన విక్రమ్ కేశరీ అరుఖా సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనారోగ్య కారణంగా పదవికి రాజీనామా చేసిన ఎస్ఎన్ పాత్రో స్థానంలో మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ అరుఖా నియమితులయ్యారు. అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ స్పీకర్ పదవికి అరుఖా పేరును ప్రతిపాదించారు. దీనికి అన్ని పార్టీల సభ్యులు మద్దతు ఇచ్చారు. సభలో అధికార బీజేడీకి 114 మంది ఎమ్మెల్యేలు ఉండగా, ప్రతిపక్ష బీజేపీకి 22 మంది, కాంగ్రెస్‌కు తొమ్మిది మంది, సీపీఎం ఒకరు, స్వతంత్ర ఎమ్మెల్యే ఒకరు ఉన్నారు. రాజకీయ ఆలోచనలకు అతీతంగా సభను నడపాలని బీజేపీ చీఫ్ విప్ మోహన్ మాఝీ అరుఖాను కోరారు. "అరుఖాకు సుదీర్ఘ అనుభవం ఉన్నందున, ఆయన నిష్పక్షపాతంగా పని చేయగలరని నేను ఆశిస్తున్నాను" అని అన్నారు. ప్రతిపక్ష సభ్యులకు ప్రాధాన్యత ఇవ్వాలని కాంగ్రెస్ శాసనసభా పక్ష నేత నరసింగ మిశ్రా కొత్త స్పీకర్‌ను కోరారు. పార్లమెంటరీ వ్యవహారాల మాజీ మంత్రిగా కూడా పనిచేసిన అరుఖా, ఒడిశా అసెంబ్లీకి 21వ స్పీకర్ అయ్యారు. శనివారం ఆయన బీజేడీ ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. "నేను సభ్యులందరి సహకారాన్ని కోరుతున్నాను. సభ గౌరవాన్ని కాపాడటానికి ప్రయత్నిస్తాను" అని అరుఖా పేర్కొన్నారు. తన పేరును ప్రతిపాదించినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. అరుఖా 1995 నుంచి భంజానగర్ ఎమ్మెల్యేగా ఉన్నారు. రాష్ట్ర మంత్రివర్గం పునర్వ్యవస్థీకరణకు మార్గం సుగమం చేస్తూ 20 మంది మంత్రులు రాజీనామా చేసినప్పుడు మాజీ స్పీకర్ పాత్రో ఈనెల ప్రారంభంలో రాజీనామా చేశారు.

పోలీసు విచారణకు నూపుర్‌శర్మ డుమ్మా

థానె: మహ్మద్ ప్రవక్తకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసినందుకుగాను బీజేపీ నేత నూపుర్‌శర్మకు మహారాష్ట్రలోని భివాండి పోలీసులు సమన్లు పంపారు. విచారణకు ఆమె సోమవారమే హాజరు కావాల్సి ఉన్నప్పటికీ...తనకు కొంత సమయం కావాలని పోలీసులను వేడుకున్నారు. అందుకు అవకాశం ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. నూపుర్ శర్మ వాంగ్మూలాన్ని నమోదు చేయడం కోసం ఆమెకు సమన్లు పంపినట్లు చెప్పారు. అయితే, నూపుర్ శర్మకు ఎంత సమయం ఇచ్చిందీ అధికారులు వెల్లడించలేదు. టీవీ చర్చ సందర్భంగా మహ్మద్ ప్రవక్తపై శర్మ అనుచిత వ్యాఖ్యలు చేసినందుకుగాను ఆమెపై భివాండి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

జావెద్ అహ్మద్ ఇంటి కూల్చివేతపై

చీఫ్ జస్టిస్‌కు ఫిర్యాదు

ప్రయాగ్‌రాజ్: జూన్ 10వ తేదీ నాటి హింసకు సూత్రధారుడిగా ఆరోపిస్తూ జావెద్ అహ్మద్ ఇంటిని ప్రయాగ్‌రాజ్ అభివృద్ధి సంస్థ(పీడీఏ) కూల్చివేయడానికి వ్యతిరేకంగా న్యాయవాదుల బృందం అలహాబాద్ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసింది. జావెద్ అహ్మద్ ఇంటికి పీడీఏ అనుమతి తీసుకోలేదన్న సాకుతో ఆయన ఇంటిని బుల్డోజర్లతో నేలమట్టం చేసిన విషయం విదితమే. ఆ ఇంటి యజమాని జావెద్ భార్య ప్రవీణ్ ఫాతిమా అని న్యాయవాదుల సంఘానికి చెందిన ఐదుగురు న్యాయవాదులు ఈ మెయిల్ ద్వారా అలహాబాద్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు ఫిర్యాదు చేశారు. పెళ్లికి ముందే ఫాతిమాకు ఆమె తల్లిదండ్రులు ఇచ్చారని, ఆ ఇంటిపై జావెద్‌కు ఎలాంటి హక్కులు లేవని న్యాయవాదులు వివరించారు. ఫాతిమా ఇల్లు కూల్చివేత చట్టానికి వ్యతిరేకమని పేర్కొన్నారు. ఒకవేళ ఇల్లు కూల్చివేతను సమర్థించినప్పటికీ పీడీఐ అధికారులు జూన్ 11న మాత్రమే ఆ ఇంటికి నోటీసులు అంటించారని, అంతకుముందు తేదీతో ఈ నోటీసు ఉందని తెలిపారు. జావెద్‌కుగానీ, ఆయన భార్యకు గానీ షోకాజ్ నోటీసు అందలేదని స్పష్టంచేశారు. సామాజిక కార్యకర్త జావెద్‌ను జూన్ 10వ తేదీ రాత్రి అరెస్టు చేశారని, మరుసటి రోజు ఖుల్దాబాద్ పోలీసు స్టేషన్‌లో ఆయనకు వ్యతిరేకంగా ఎఫ్ఐఆర్ నమోదైందని పిటిషన్‌లో పేర్కొన్నారు.

డ్రగ్స్ ఆరోపణలపై నటుడు సిద్ధాంత్ కపూర్ అరెస్ట్

బెంగళూరు: నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన పార్టీలో బాలీవుడ్ నటుడు శక్తికపూర్ కుమారుడు సిద్ధాంత్ కపూర్, మరో నలుగురు కలిసి రేవ్ పార్టీలో డ్రగ్స్ తీసుకున్న ఆరోపణలపై సిద్ధాంత్ కపూర్‌ను అరెస్టు చేసినట్టు సోమవారం పోలీసులు తెలిపారు. 'సిద్ధాంత్ కపూర్ డ్రగ్స్ తీసుకున్నాడు. రక్తనమూనాలు పరీక్షించగా అది పాజిటివ్ వచ్చింది. దీంతో అతడిని ఉల్సూర్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చాం' అని డిప్యూటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ భీమ్‌శంకర్ ఎస్ గులెడ్ విలేకరులకు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, ఎంజీ రోడ్‌లోని ఓ అత్యాధునిక హోటల్‌లో ఆదివారం రాత్రి రేవ్ పార్టీ జరుగుతున్నట్టు వచ్చిన సమాచారంతో తాము దాడి చేశామన్నారు. 'షూట్ అవుట్ ఎట్ వాడ్లా', 'అగ్లీ' సినిమాల్లో నటుడిగా, 'ఢోల్' చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా నటించిన 37 ఏళ్ల సిద్ధాంత్ కపూర్, మరో నలుగురిని అరెస్టు చేశామన్నారు. సిద్ధాంత్ కపూర్ ఆహ్వానం మేరకు మరో 35మంది ఈ పార్టీలో పాల్గొన్నారు. వారందరికీ వైద్యపరీక్షలు నిర్వహించామన్నారు. ఘటనా స్థలంలో ఎక్స్‌టాసీ మాత్రలు, గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ పదార్థాల చట్టం కింద నిందితుడిపై కేసు నమోదు చేశామని డీసీపీ తెలిపారు. ఇదిలా ఉంటే 2020లో చిత్ర పరిశ్రమలో డ్రగ్స్ వినియోగాన్ని పోలీసులు బట్టబయలు చేశారు. ఈ కేసులో ప్రముఖ నటీమణులు రాగిణి ద్వివేదీ, సంజనా గర్లానీ, మాజీ మంత్రి దివంగత జయరాజ్ అల్వా కుమారుడు ఆదిత్య అల్వాను అరెస్టు చేశారు.

నూపుర్ శర్మకు మద్దతుగా పోస్టు

యువకుడిపై కేసు నమోదు

థానే: మహమ్మద్ ప్రవక్తపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేత నూపుర్ శర్మకు మద్దతుగా నిలిచిన 22 ఏళ్ల యువకుడిపై మహారాష్ట్ర పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ముఖేశ్ చవాన్ అనే యువకుడు నూపుర్ శర్మ చేసిన వ్యాఖ్యలకు తన మద్దతు ఉంటుందని సామాజిక మాధ్యమాల్లో చేసిన పోస్టుపై ఫిర్యాదు అందడంతో భివాండి పట్టణంలోని నార్పోలీ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు. నిందితుడు నూపుర్ శర్మ ఫొటోతో పాటు ఆమె చేసిన వ్యాఖ్యలను సమర్థించినట్టు ఆ పోస్టులో స్పష్టంగా ఉండడంతో ఐపీసీ 153 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్టు తెలిపారు. మతపరమైన మనోభావాలను దెబ్బతీస్తూ ఉద్దేశపూర్వకంగా సమాజంలో అల్లర్లు సృష్టించే క్రమంలోనే నిందితుడు ఈ పోస్టు చేసినట్టు తెలుస్తోందని పేర్కొన్నారు. అయితే ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదన్నారు. ఇదిలా ఉండగా నూపుర్ శర్మకు మద్దతు తెలిపిన 19 ఏళ్ల ముస్లిం యువకుడిని భివాండి పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు.

ప్రవక్త వివాదం... నూపుర్ శర్మకు సమన్లు

కోల్‌కతా: ప్రవక్త మహమ్మద్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన, సస్పెండైన బీజేపీ అధికార ప్రతినిధి నూపుర్ శర్మకు సోమవారం కోల్‌కతా పోలీసులు సమన్లు జారీ చేశారు. జూన్20న నార్కెల్‌దంగా పోలీసు స్టేషన్‌కు విచారణ నిమిత్తం హాజరు కావాలని సమాచారం అందించినట్టు పోలీసు అధికారి తెలిపారు. ఓ టీవీ డిబేట్‌లో శర్మ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల కారణంగా దేశంలోని పలు ప్రాంతాల్లో హింస చెలరేగిన విషయం తెలిసిందే. ఆమె వ్యాఖ్యలపై తృణమూల్ కాంగ్రెస్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సోహైల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

మూసావాలా హత్య కేసులో మరో ఇద్దరి అరెస్ట్

పూణె: పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్య కేసులో షూటర్ సంతోష్ జాదవ్, అతడి సహాయకుడు నవనాథ్ సూర్యవంశీ అనే అనుమానితుడిని పూణే పోలీసులు అరెస్టు చేసినట్లు సోమవారం అధికారులు తెలిపారు. లారెన్స్ బిష్ణోయ్ ముఠా సభ్యుడు జాదవ్ (24), సూర్యవంశీ (27)లను గుజరాత్‌లోని భుజ్‌లోని మాండవి తాలూకాలో పూణె రూరల్ పోలీసుల బృందం ఆదివారం పట్టుకున్నట్లు అడిషనల్ డైరెక్టర్ జనరల్ (లా అండ్ ఆర్డర్) కుల్వంత్ సింగ్ సారంగల్ తెలిపారు. మహారాష్ట్రలోని పూణె జిల్లాలోని మంచార్ పోలీస్ స్టేషన్‌లో 2021లో నమోదైన హత్య కేసులో జాదవ్‌ను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. ఏడాది కాలంగా పరారీలో ఉన్న జాదవ్ అరెస్టును తప్పించుకునేందుకు గుండు కొట్టించుకుని రూపురేఖలు మార్చుకున్నాడని అధికారి పేర్కొన్నారు. ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ కస్టడీలో ఉన్న బిష్ణోయ్‌ని విచారించేందుకు పూణె రూరల్ పోలీసు బృందం కూడా ఢిల్లీకి వెళ్లిందని, మూసేవాలా హత్యకు ప్రధాన సూత్రధారి అని ఆయన చెప్పారు. మూసేవాలా హత్య కేసు విచారణలో జాదవ్, సూర్యవంశీ పేర్లు బయటపడ్డాయి. ఢిల్లీ, పంజాబ్‌తో సహా పలు పోలీసు బృందాలు వీరి కోసం గాలిస్తున్నాయి. పూణే రూరల్ పోలీసులు కూడా తమ విచారణను ముమ్మరం చేశారు. 2021 హత్య కేసు తర్వాత జాదవ్‌కు ఆశ్రయం కల్పించిన నిందితుడు సిద్ధేష్ కాంబ్లే అలియాస్ మహాకల్‌ను గత వారం అరెస్టు చేశారు. జాదవ్‌ను గుర్తించేందుకు గత వారం గుజరాత్, రాజస్థాన్‌లకు పోలీసు బృందాలు వెళ్లాయి.

యూపీలో అరెస్టుల పర్వం

బెంగాల్‌లో కొనసాగిన నిరసనలు

విచారణకు సమయం కోరిన నూపుర్‌శర్మ

థానే: మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు దేశంలో అశాంతికి, హింసాత్మక ఘటనలకు కారణమైన బీజేపీ బహిష్కృత నేత నూపుర్ శర్మ... మహారాష్ట్ర పోలీసుల ఎదుట హాజరై స్టేట్‌మెంట్ ఇచ్చేందుకు మరింత సమయం కావాలని కోరారు. అయితే ఉత్తరప్రదేశ్‌లో యోగి ప్రభుత్వం.. హింస్మాతక ఘటనకు పాల్పడ్డారని పేర్కొంటూ 300 మందికి పైగా నిరసనకారులను అరెస్టు చేసింది. పశ్చిమ బెంగాల్‌లోని హింస చోటు చేసుకున్న జిల్లాల్లో నెమ్మదిగా సాధారణ స్థితికి చేరుకుంటున్నాయి. అయితే భారీ పోలీసు భద్రత ఉన్నప్పటికీ సోమవారం కొన్ని చోట్ల చెదురుమదురు సంఘటనలు జరిగాయి. నిరసనకారులు ఉదయం తూర్పు రైల్వేలోని సీల్దా-హష్నాబాద్ సెక్షన్‌లో ట్రాక్‌లపై టైర్లకు నిప్పు పెట్టి, నూపుర్ శర్మ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. దీంతో కొంతసేపు రైల్ సర్వీసులకు అంతరాయం ఏర్పడినట్లు అధికారులు తెలిపారు. నార్త్ 24 పరగణాల్లోని హస్నాబాద్ స్టేషన్ చుట్టూ భారీగా పోలీసులు మోహరించారు. హౌరా, ముర్షిదాబాద, నదియా జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలలో సెక్షన్ 144 అమలులో ఉంది.

నూపుర్‌శర్మకు సమన్లు

మహారాష్ట్రలోని థానే జిల్లాలోని భివాండిలో ఒక పోలీసు అధికారి మాట్లాడుతూ... శర్మ తమ ఎదుట విచారణకు హాజరు కావడానికి సమయం అడిగారని, అయితే ఆమె ఎప్పుడు హాజరవుతారో పేర్కొనలేదు. మే 30న రజా అకాడమీ ప్రతినిధి చేసిన ఫిర్యాదు మేరకు భివాండీ పోలీసులు టీవీ చర్చలో మహమ్మద్ ప్రవక్తపై చేసిన వ్యాఖ్యలపై శర్మపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. థానేలోని ముంబ్రా పోలీసులు జూన్ 22న తమ ముందు హాజరుకావాలని శర్మను కోరగా, జూన్ 25న ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేసుకోవాలని ముంబై పోలీసులు ఆమెకు సమన్లు పంపారు. కాగా కోల్‌కతా పోలీసులు సైతం సోమవారం ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేయడానికి జూన్ 20 న నార్కెల్‌దంగా పోలీస్ స్టేషన్‌కు హాజరు కావాలని సమన్లు జారీ చేసినట్లు ఒక అధికారి తెలిపారు. జూన్ 10న జరిగిన హింసాత్మక ఘటనలకు సంబంధించి ఉత్తరప్రదేశ్ పోలీసులు ఇప్పటివరకు రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాలకు చెందిన 325 మందిని అరెస్టు చేసినట్లు అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్) ప్రశాంత్ కుమార్ తెలిపారు. తొమ్మిది జిల్లాల్లో హింసాత్మక సంఘటనల తరువాత 13 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాల వారీగా వివరాలను తెలియజేస్తూ.. ప్రయాగ్‌రాజ్‌లో 92 మంది, సహరాన్‌పూర్‌లో 80, హత్రాస్‌లో 51, అంబేద్కర్ నగర్‌లో 41, మొరాదాబాద్‌లో 35, ఫిరోజాబాద్‌లో 16, అలీగఢ్‌లో ఆరుగురు, జలౌన్‌లో నలుగురిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. అదే సమయంలో ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన హింసాకాండకు ప్రధాన సూత్రధారిగా చెప్పబడుతున్న జావేద్ అహ్మద్ ఇంటిని కూల్చివేయడాన్ని వ్యతిరేకిస్తూ న్యాయవాదుల బృందం అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించింది. మరోపక్క బీఎస్పీ అధినేత్రి మాయావతి స్పందిస్తూ... హింసాకాండలో పాల్గొన్న నిందితుల ఇళ్లను బుల్డోజింగ్ చేయడం అన్యాయమని, కోర్టులు దీనిని గమనంలోకి తీసుకోవాలని కోరారు. ప్రయాగ్‌రాజ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పిడిఎ) ఆదివారం కూల్చివేసిన ఇల్లు జావేద్ భార్య పర్వీన్ ఫాతిమాదేనని జిల్లా ఆదివక్త్ మంచ్‌కు చెందిన ఐదుగురు న్యాయవాదులు అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సమర్పించిన పిటిషన్‌లో పేర్కొన్నారు.

'గిరిజన' సమస్యలు పరిష్కరిస్తాం

విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి జైశంకర్

విశాలాంధ్ర-పాడేరు: గిరిజన ప్రాంతంలో నెలకొన్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ సుబ్రహ్మణ్యం జైశంకర్ తెలిపారు. సోమవారం అల్లూరి జిల్లా పాడేరు పర్యటనలో భాగంగా స్థానిక ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. అల్లూరి జిల్లాలోని విద్యుత్, తాగునీటి సమస్యలు, విద్య, వైద్యం, రహదారులు, నెట్వర్క్ కనెక్ట్, వ్యవసాయ రంగ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రితో మాట్లాడి జిల్లాలోని గ్రామీణ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా విస్తీర్ణం, జనాభా, విద్యా, వైద్య సేవలు, తాగునీటి సమస్యలు రోడ్డు సదుపాయాలు ఉన్న గ్రామాలు, రోడ్లు లేని గ్రామాలు విద్యుత్ సదుపాయాలు లేని గ్రామాల గుణంకలను మంత్రికి వివరించారు. మిషన్ కనెక్ట్ పాడేరులో 979 గ్రామాలకు రోడ్లు, 40 గ్రామాలకు విద్యుత్ సదుపాయం లేదని గుర్తించామన్నారు. రానున్న మూడేళ్లలో సమస్యల పరిష్కారానికి ఐటీడీఏ పీవో ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. రూ.239 కోట్లతో జల్ జీవన్ మిషన్ పథకంలో

తాగునీటి పథకాలను నిర్మిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య సేవలపై దృష్టి పెట్టిందని తెలిపారు. ఆదివాసీ గిరిజనుల విద్యాభివృద్ధికి ఏర్పాటుచేసిన భాషా వలంటీర్ల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అటవీ హక్కు చట్టంలో లక్షకుపైగా పైబడి ఎకరాలకు లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఐటీడీఏ కార్యాలయం వద్ద వెలుగు అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీడీవీకే ఉత్పత్తులను మంత్రి పరిశీలించారు. కాఫీ తోటలను సందర్శించారు. మిరియాల సాగు విధానంపై గిరిజన రైతుల వస్తున్న ఆదాయాలను ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ వివరించారు. ఐటీడీఏ నుంచి రాయితీపై కల్లలు, బేబీ పల్వర్లు, నిచ్చెనలు రైతులకు యూనిట్ల పంపిణీ చేశామన్నారు. అనంతరం అక్కడి నుంచి పాడేరు చేరుకుని స్థానిక పాలిటెక్నిక్ కళాశాల వద్ద రూ.500 కోట్లతో నిర్మిస్తున్న వైద్య కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు.

స్థానిక మోదకొండమ్మ వారిని మంత్రి దర్శించుకున్నారు. ఆలయ లాంచనాలతో ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ పీవీఎం మాధవ్, అరుకు ఎంపీ మాధవి, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, సబ్ కలెక్టర్ అభిషేక్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, ఏపీ వైద్య మండలి సభ్యులు డా నర్సింగ రావు, డీపీఓ పీ ఎస్ కుమార్, డీఎఫ్ఓ వినోద్ కుమార్, డీడీ మణికుమార్, టీడబ్ల్యు ఈ ఈ డీవీఆర్ఎం రాజు పాల్గొన్నారు.

విజయాల వేదిక విశాఖ

- టీమిండియాకు అచ్చొచ్చిన స్టేడియం
- నేడు భారత్-దక్షిణాఫ్రికా మూడో టీ20
- మ్యాచ్‌కు సర్వం సిద్ధం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖలో క్రికెట్ సందడి నెలకొంది. మంగళవారం భారత్-దక్షిణాఫ్రికా మధ్య జరిగే టీ 20 మూడో మ్యాచ్‌కు సర్వం సిద్ధమయ్యాయి. ఇప్పటికే రెండు జట్ల క్రీడాకారులు విశాఖ చేరుకున్నారు. ప్రేక్షకులకు ఎలాంటి ఇబ్బం దులు తలెత్తకుండా నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. మంగళవారం రాత్రి 7 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది.

టీమిండియాకు విశాఖ ప్రత్యేకం. ఇప్పటి వరకు ఇక్కడ రెండు టెస్టులు, 15 వన్డేలు, రెండు టీ20 మ్యాచ్‌లు జరగ్గా టీమిండియా 90 శాతం విజయం సాధించింది. విశాఖలో తొలిసారిగా అంతర్జాతీయ వన్డే క్రికెట్ మ్యాచ్ 1988 డిసెంబర్ 10న భారత్-న్యూజిలాండ్‌ల మధ్య ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో జరిగింది. తర్వాత 1994 నవంబర్ 4న వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో టీం ఇండియా నాలుగు పరుగుల తేడాతో విజయం సాధించింది. 1996లో ఆస్ట్రేలియా-కెన్యా, 1999లో పాకిస్తాన్-శ్రీలంక జట్ల వన్డే మ్యాచులు విశాఖలోనే జరిగాయి. 2001 ఏప్రిల్ 3న భారత్-ఆస్ట్రేలియా మధ్య జరిగిన వన్డేలో భారత్ ఓటమి పాలైంది. 2005 నుంచి (ఏసీఏ-వీసీడీఏ) పోతిన మల్లయ్య పాలెం క్రికెట్ స్టేడియంలో మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. 2005 ఏప్రిల్ 5న ఇండియా-పాకిస్తాన్ పోటీ పడ్డాయి. ఈ మ్యాచ్‌లో పాక్ చిత్తుగా ఓడిపోయింది. 2012లో సెప్టెంబర్ 8న తొలి టీ-20 మ్యాచ్ ఈ స్టేడియంలోనే జరిగింది. 2016 నవంబర్ 17 నుంచి 21 వరకు తొలి టెస్ట్ మ్యాచ్‌కు వేదికగా నిలిచింది. తాజాగా నేడు జరగనున్న భారత్ - సౌతాఫ్రికా మధ్య టీ20 మూడో మ్యాచ్ మరోసారి విశాఖ వేదికైంది. దీంతో క్రీడాభిమానులు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. ఆదివారం కటక్‌లో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో భారత్ నాలుగు వికెట్ల తేడాతో ఓడిపోయింది. దీంతో మూడో మ్యాచ్‌పై ఉత్కంఠ నెలకొంది.

విశాఖ చేరుకున్న జట్లు: సోమవారం కటక్ నుంచి ప్రత్యేక విమానంలో రెండు జట్లూ విశాఖ చేరుకున్నాయి. క్రీడాభిమానులు విమానా శ్రయానికి చేరుకొని టీమిండియా జట్టును చూసేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం ప్రత్యేక బస్సులో రెండు జట్ల ఆటగాళ్లు రిషికొండ బీచ్ రోడ్‌లో ఉన్న రాడిసన్ బ్లూ హోటల్‌లో బస్ చేశారు.

ఏర్పాట్లు రెడీ: ఈ మ్యాచ్ సందర్భంగా విశాఖ సీపీ సీహెచ్ శ్రీకాంత్ ఉత్తర్వుల మేరకు ప్రేక్షకులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తూ, ప్రేక్షకుల వాహనాలు పార్కింగ్ చేయడానికి తగిన స్థలాలు ఏర్పాటు చేస్తూ, ట్రాఫిక్ సంబంధించి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా 1487 మంది పోలీసులు, ఆర్మ్‌డ్ రిజర్వ్ 105, 15 ఆర్మ్‌డ్ రిజర్వ్ సెక్షన్లు, 2 స్పెషల్ పార్టీలు, 9 రోడ్ ఓపెనింగ్ పార్టీలు, 10 యాంటీ టీమ్స్, ఐదు డాగ్స్, ఒక ఆక్టోపస్ టీం నియమించనట్లు పోలీసులు వెల్లడించారు. అలాగే నగరంలో ట్రాఫిక్ నియంత్రణపై ఇప్పటికే ప్రజలకు తెలియజేశామని, మ్యాచ్ సందర్భంగా స్టేడియంలోకి ఎటువంటి ప్లాస్టిక్ బాటిళ్లకు అనుమతి లేదని, క్రీడాభిమానులు సహకరించాలని కోరారు. మ్యాచ్ సందర్భంగా విధించిన ట్రాఫిక్ ఆంక్షలు మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు అమలులో ఉంటాయన్నారు. క్రికెట్ మ్యాచ్ సందర్భంగా ప్రేక్షకుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేకంగా 100 బస్సుల సర్వీసులు నడుపుతోందన్నారు.

సాయుధ దళాల్లో మహిళలను చూసి గర్విస్తున్నా

రాష్ట్రపతి కోవింద్

బెంగళూరు: సాయుధ దళాలలో చేరుతున్న మహిళల సంఖ్య పెరగడంపై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సోమవారం హర్షం వ్యక్తం చేశారు. బెంగళూరులోని రాష్ట్రీయ మిలిటరీ స్కూల్ (ఆర్ఎంఎస్) ప్లాటినం జూబ్లీ వేడుకలను ఆయన ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యుద్ధంలో కీలక పాత్రలు సహా సహా సాయుధ దళాలలో మహిళల సంఖ్య పెరగడం చూసి సర్వ సైన్యాధిపతిగా నేను ఎంతో గర్విస్తు న్నాను... ఇటీవలే కెప్టెన్ అభిలాషా బరాక్ ఆర్మీ ఏవియేషన్ కార్ప్స్‌లో పోరాట ఏవియేటర్‌గా చేరిన మొదటి మహిళా అధికారి కావడం ఆనందంగా ఉందని కోవింద్ అన్నారు.

ఈ ఏడాది నుంచి దేశవ్యాప్తంగా రాష్ట్రీయ సైనిక పాఠశాలల్లో బాలిక(క్యాడెట్లు)లు అడ్మిషన్లు పొందబోతుండటంపై ఆయన హర్షం వెలిబుచ్చారు. ఈ ఏడాది నుంచి బాలికల కోసం నేషనల్ డిఫెన్స్ అకాడమీ గేట్లను కూడా తెరిచినట్లు రాష్ట్రపతి పేర్కొన్నారు. 'మన కూతుళ్లు ఎన్నో అద్దాలను బద్దలు కొట్టి, వివిధ రంగాల్లో కొత్త రికార్డులు సృష్టిస్తూ దేశం గర్వించేలా చేస్తున్నారు. నేను దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలు, ఇన్‌స్టిట్యూట్‌లకు వెళ్లినప్పుడు... అబ్బాయిల కంటే అమ్మాయిలు రాణిస్తున్న సందర్భాలను చూస్తున్నాను' అని కోవింద్ అన్నారు. బెంగళూరు దేశంలోని అత్యుత్తమ బోర్డింగ్ పాఠశాలల్లో ఒకటిగా గుర్తించబడిందని రాష్ట్రపతి తెలిపారు.

సోదరి చితిలో దూకి యువకుడి ఆత్మహత్య

సాగర్(మధ్యప్రదేశ్): మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో 18 ఏళ్ల యువకుడు తన సోదరి అంత్యక్రియల చితిలో దూకి తన జీవితాన్ని ముగించుకున్నట్లు సోమవారం పోలీసులు తెలిపారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బహేరియా పోలీస్‌స్టేషన్ పరిధిలోని మజ్హువా గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుందని, అతని తీవ్ర చర్య వెనుక కారణం ఇంకా తెలియరాలేదని పేర్కొన్నారు. కూరగాయల కోసం పొలానికి వెళ్లేందుకు ఇంటి నుంచి బయలుదేరిన 21 ఏళ్ల బంధువు గురువారం సాయంత్రం అదృశ్య మైనట్లు బహేరియా పోలీస్‌స్టేషన్ ఇన్‌ఛార్జ్ దివ్య ప్రకాశ్ త్రిపాఠి తెలిపారు. ఆమె తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకడం ప్రారంభించారు. గ్రామంలోని పొలం వద్ద ఉన్న బావిలో జారిపడి ఉండవచ్చని వారు అనుమానిస్తున్నారు. అనంతరం బావిలో మహిళ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించినట్లు అధికారి తెలిపారు. మహిళ మరణం గురించి సమాచారం అందుకున్న తరువాత, సాగర్‌కు 430 కి.మీ దూరంలో ఉన్న ధార్‌లో నివసించే ఆమె బంధువు కరణ్ (18) తన మోటారుసైకిల్‌పై సాగర్‌కు వెళ్లినట్లు దివ్య ప్రకాశ్ త్రిపాఠి చెప్పారు. శుక్రవారం సాయంత్రం, మహిళ అంత్యక్రియల సమయంలో, కాలిపోతున్న చితిలో కరణ్ దూకినట్లు ఆయన వివరించారు. కొంతమంది గ్రామస్తులు అతన్ని దూరంగా లాగి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

శాంతించిన రిటైల్ ద్రవ్యోల్బణం

ముంబై: ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం కాస్త శాంతించింది. 2022 మే చిల్లర ద్రవ్యోల్బణం 7.04 శాతానికి దిగి వచ్చింది. అయినా ఆర్బీఐ పరిమితి కంటే ఎక్కువ స్థాయిలో రిటైల్ ద్రవ్యోల్బణం నమోదు కావడం ఇది ఐదోసారి. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గడంతోపాటు ఆహార ధాన్యాల ధరలు పెరిగాయని ప్రభుత్వం సోమవారం వెలువరించిన డేటా పేర్కొంది. గత ఏప్రిల్ నెల చిల్లర ద్రవ్యోల్బణం 7.79 శాతంగా ఉన్న సంగతి తెలిసిందే. భారీగా నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడంతో గత నెలలో కేంద్రం అప్రమత్తమైంది. ధరలపై పోరుకు పెట్రోల్, డీజిల్‌లపై పన్నులో కోత విధించింది. ఇతర నిత్యావసర వస్తువులపై పన్ను వ్యవస్థను సవరించింది. పెట్రోల్, డీజిల్ ధరలు ఎక్కువగా ఉండటంతో గోధుమలు, టమాటా, బంగాళదుంప ఇతర కూరగాలయ ధరలు భారీగా పెరిగాయి. ఉత్తర భారతదేశంలో వేడి గాలుల వల్ల పంటల దిగుబడులు తగ్గిపోయాయి. ఏప్రిల్‌లో కటాఫ్ స్థాయి కంటే చిల్లర ద్రవ్యోల్బణం నమోదు కావడంతో గత నెల 40 బేసిక్ పాయింట్లు, ఈ నెల 50 బేసిక్ పాయింట్లు ఆర్బీఐ రెపోరేట్ పెంచేసింది. గత డిసెంబర్ నుంచి ద్రవ్యోల్బణం... ఆర్బీఐ కటాఫ్ స్థాయికి పైనే నమోదవుతున్నది.

ఆందోళనకారుల్ని బహిష్కరిస్తున్నాం: కువైత్

దుబాయ్: భారత్‌లో బీజేపీ నేతలు మహమ్మద్ ప్రవక్తపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ... ఆందోళన చేపట్టిన ప్రవాసులను తిరిగి స్వదేశాలకు పంపించాలని కువైత్ ప్రభుత్వం నిర్ణయించింది. గల్ఫ్ దేశాల్లో ఎటువంటి నిరసన ప్రదర్శన లు చేపట్టరాదు. అట్టి ప్రదర్శనలపై నిషేధం ఉంది. అయితే ఫాహహీల్ ఏరియాలో శుక్రవారం ప్రార్థనల అనంతరం కొందరు నిరసన ప్రదర్శన చేపట్టారు. అందులో విదేశీయులు ఉన్నారని, వారిని స్వదేశానికి పంపనున్నట్లు కువైత్ ప్రభుత్వం తెలిపింది. దేశంలోని చట్టాలను ఆందోళనకారులు ఉల్లంఘించారని, వాళ్లను స్వదేశాలకు పంపనున్నట్లు వెల్లడించింది. నిరసనకారుల్ని డిటెక్టివ్‌లు గుర్తించి అరెస్టు చేస్తున్నారని, మళ్లీ కువైత్‌లో అడుగుపెట్టకుండా ఉండేలా వారిపై నిషేధం విధించనున్నట్లు కువైత్ పత్రిక ఒకటి తెలిపింది. ఇంతకీ ఆ నిరసన ప్రదర్శనలో ఏ దేశంవారు పాల్గొన్నారో తెలియరాలేదు. మహమ్మద్ ప్రవక్తపై బీజేపీ నేతలు నూపుర్ శర్మ, నవీన్ జిందాల్ చేసిన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా నిరసన జ్వాలలు చెలరేగాయి. భారత్ లోనే కాక, ముస్లిం దేశాల్లోనూ నిరసనలు వెల్లువెత్తాయి. కువైత్‌లోనూ ప్రవాసులు నిరసన ప్రదర్శనలు చేపట్టారు.

నిరుద్యోగమే పెద్ద సమస్య: వరుణ్‌గాంధీ



న్యూఢిల్లీ: దేశంలో నిరుద్యోగమే అతిపెద్ద సమస్య అని బీజేపీ ఎంపీ వరుణ్‌గాంధీ చెప్పారు. నిరుద్యోగంపై పదేపదే మాట్లాడుతున్న ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీని ఆయన ప్రశంసించారు. అత్యంత కీలకమైన సమస్యలపై మోదీ సర్కారుకు ఇబ్బందికరంగా వరుణ్‌గాంధీ తరచూ మాట్లాడటం తెలిసిందే. ప్రభుత్వంలోని అనేక రంగాల్లో ఉద్యోగ ఖాళీలను ప్రస్తావిస్తూ ఒవైసీ చేసిన ప్రసంగం వీడియోను వరుణ్‌గాంధీ పోస్టు చేశారు. 'దేశంలో నేడు అతిపెద్ద సమస్య నిరుద్యోగం. ఈ విషయాన్ని దేశంలోని నాయకులంతా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి. నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలి. అప్పుడే దేశం పటిష్ఠంగా ఎదగగలదు' అని వరుణ్‌గాంధీ సోమవారం ట్వీట్ చేశారు. తాను లేవనెత్తిన అంశాలను తన ప్రసంగంలో ప్రస్తావించిన ఒవైసీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

కూల్చివేతలపై విద్యార్థుల ఆగ్రహం

జేఎన్‌యూ, జేఎంఐలో నిరసనలు

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో హక్కుల కార్యకర్తల ఇళ్లు కూల్చివేతపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. యూపీలో జేఎన్‌యూ పూర్వపు విద్యార్థి అఫ్రీన్ ఫాతిమా ఇంటిని యూపీ అధికారులు ఆదివారం కూల్చివేయడానికి నిరసనగా విద్యార్థి సంఘాలు సోమవారం జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ), జామియా మిలియా ఇస్లామియా(జేఎంఐ)లలో ప్రదర్శనలు నిర్వహించారు. ప్రయాగ్‌రాజ్‌లో జూన్ 10న జరిగిన హింసకు సూత్రధారిగా ఆరోపిస్తూ హక్కుల నేత జావెద్ అహ్మద్ ఇంటిని భారీ బందోబస్తు మధ్య ప్రయాగ్‌రాజ్ అభివృద్ధి సంస్థ(పీడీఏ) కూల్చివేసింది. ఫాతిమా తండ్రి అహ్మద్. ఆల్‌ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్(ఏఐఎస్ఏ) విద్యార్థులు సబర్మతి హాస్టల్ నుంచి జేఎన్‌యూ ద్వారం వరకు ప్రదర్శన చేశారు. యోగి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముస్లిం ప్రాణాలను బుల్డోజర్లతో చంపొద్దు...ముస్లింలపై ప్రభుత్వ ప్రోత్సాహ ఉగ్రవాదాన్ని ఆపండి అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. జంతర్ మంతర్ వద్ద కూడా ఏఐఎస్ఏ ధర్నా చేసింది. ఢిల్లీ పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నా విద్యార్థులు మాత్రం ఆందోళన కొనసాగించారు. జేఎంఐ క్యాంపస్‌లోనూ విద్యార్థులు నిరసన తెలిపారు. అక్రమ కూల్చివేతలను ఆపాలని, యూపీ, జార్ఖండ్, ఇతర ప్రాంతాల్లో ముస్లిం ఆందోళనకారులపై కక్షసాధింపును ఆపాలని డిమాండ్ చేశారు.

బీసీసీఐకి కాసుల పంట

రికార్డు స్థాయిలో ఐపీఎల్ టీవీ, డిజిటల్ హక్కులు వేలం

టీవీ ప్రసార హక్కులు దక్కించుకున్న సోనీ

న్యూఢిల్లీ: ఐపీఎల్ మీడియా హక్కుల కోసం 2023-2027 కాలానికి గాను మొత్తం నాలుగు ప్యాకేజీలుగా విభజించి నిర్వహిస్తున్న ఈ-వేలంలో టీవీ, డిజిటల్ హక్కులను రూ.44,075కు రెండు బ్రాడ్‌కాస్టింగ్ సంస్థలు దక్కించుకున్నాయి. టీవీ ప్రసార హక్కులను సోనీ దక్కించుకుంది. 410 మ్యాచ్‌లకు ఈ మొత్తాన్ని చెల్లిస్తున్నట్లు తెలిసింది. టీవీ హక్కుల విలువ కంటే డిజిటల్ హక్కుల విలువ 10 శాతం తక్కువగా ఉందని అనలిస్టులు అంచనా వేస్తున్నారు. అయితే.. డిజిటల్ రైట్స్ విలువ మాత్రం డే-1తో పోల్చుకుంటే పెరిగింది. తొలి రోజు ఈ-వేలంలో రూ.19,680 కోట్లు పలికితే రెండో రోజైన సోమవారం రూ.20,500 కోట్లు పలికినట్లు తెలిసింది. టీవీ హక్కులు రూ.23,575 కోట్లు పలకగా, డిజిటల్ హక్కులు రూ.20,500 కోట్లు పలికినట్లు సమాచారం. మొత్తంగా 410 మ్యాచులకు గానూ డిజిటల్, టీవీ హక్కుల కోసం రూ.44,075 కోట్లు చెల్లించేందుకు బిడ్డర్లు ముందుకొచ్చినట్లు తెలిసింది. 'బి' ప్యాకేజీ కింద భారత ఉపఖండంలో డిజిటల్ రైట్స్‌ను వయాకామ్-18 దక్కించుకున్నట్లు సమాచారం. స్టార్ ఇండియా 2017 నుంచి 22 వరకూ ఐపీఎల్ డిజిటల్, టీవీ ప్రసార హక్కులను రూ.16,347.50 కోట్లకు సెప్టెంబర్ 2017లో సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. అంతకు ముందు.. సోనీ పిక్చర్ నెట్‌వర్క్ ఐపీఎల్ టీవీ మీడియా హక్కులను పదేళ్లకు గానూ రూ.8,200 కోట్లు చెల్లించి దక్కించుకుంది. అలా మొదలైన ఈ ఐపీఎల్ టీవీ, డిజిటల్ హక్కుల వేలం ఇప్పుడు వేల కోట్లు పలుకుతూ బీసీసీఐకి కాసుల వర్షం కురిపిస్తోంది.

ఐపీఎల్ ఈ-వేలం విశేషాలివి..

బిడ్డింగ్ ప్రక్రియను నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. 'ఏ' ప్యాకేజీ ప్రకారం భారత ఉపఖండంలో టీవీ హక్కులు, 'బి' ప్యాకేజీ కింద భారత ఉపఖండంలో డిజిటల్ రైట్స్, 'సి'లో ప్లేఆఫ్స్ సహా 18 మ్యాచ్‌లకు డిజిటల్ హక్కులు, 'డి' ప్యాకేజీని భారత ఉపఖండం మినహా మిగతా దేశాల్లో టీవీ, డిజిటల్ హక్కుల కోసం నిర్ణయించారు. 'ఎ' ప్యాకేజీలో కనీస ధరగా ఒక్కో మ్యాచ్‌కు రూ. 49 కోట్లు.. 'బి'లో ఒక్కో మ్యాచ్‌కు రూ. 33 కోట్లు.. 'సి'లో ధర రూ. 11 కోట్లు.. 'డి' కింద రూ. 3 కోట్లు ప్రాథమిక ధరగా బోర్డు నిర్ణయించింది. ప్రస్తుతం ఐపీఎల్ మీడియా హక్కుల వేలంలో డిస్నీ స్టార్, సోనీ నెట్‌వర్క్, వయాకామ్ రిలయన్స్-18, జీ నెట్‌వర్క్ ఉన్నాయి. ఇప్పటికే గూగుల్, అమెజాన్, యాపిల్ సంస్థలు వేలం నుంచి వైదొలిగాయి. ముందుగా భారత ఉపఖండంలో టీవీ ('ఏ' ప్యాకేజీ), డిజిటల్ (బి) హక్కుల కోసం వేర్వేరుగా వేలం నిర్వహిస్తున్నారు. ప్రధానంగా వయాకామ్ రిలయన్స్ 18, డిస్నీ స్టార్ సంస్థల మధ్య పోటీ నెలకొన్నట్లు సమాచారం. 2017లో స్టార్ ఇండియా సంస్థ ఐదేళ్ల కాలానికిగాను రూ. 16,347 కోట్లతో ఐపీఎల్ టీవీ, డిజిటల్ హక్కులను సొంతం చేసుకుంది.

యూత్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో

గురునాయుడుకు స్వర్ణం

మెక్సికో: ప్రపంచ యూత్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ కుర్రాడు గురునాయుడు (16) స్వర్ణం గెలిచి చరిత్ర సృష్టించాడు. విజయనగరం జిల్లాకు చెందిన అతడు ఈ ఘనత సాధించిన తొలి భారతీయుడిగా నిలిచాడు. మెక్సికోలో జరుగుతోన్న ప్రపంచ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో భారత లిఫ్టర్లు సత్తా చాటుతున్నారు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన బాలుర 55 కేజీల ఈవెంట్‌లో గురునాయుడు అద్భుత ప్రదర్శన కనబరిచాడు. మొత్తం 230 కేజీల బరువు ఎత్తి స్వర్ణం కైవసం చేసుకున్నాడు.

ఇక సౌదీ అరేబియాకు చెందిన అలీ మజీద్ 229 కేజీలతో రెండో స్థానంలో నిలవగా.. కజకిస్థాన్‌కు చెందిన్ ఉమ్రోవ్ 224 కేజీలతో మూడో స్థానంలో నిలిచాడు. మరోవైపు బాలికల 45 కేజీల విభాగంలో మహారాష్ట్రకు చెందిన సౌమ్య డాల్వి 148 కేజీల బరువు ఎత్తి కాంస్యం సొంతం చేసుకుంది. ఈ పోటీలో ఫిలిప్పీన్స్‌కు చెందిన జే రామోస్ 155 కేజీల బరువుతో తొలి స్థానం సాధించగా వెనుజులాకు చెందిన మాంటిల్లా 153 కేజీలతో రెండో స్థానంలో నిలిచింది.

వచ్చే ఎన్నికల తర్వాతా నేనే సీఎం: సాహా

అగర్తల: వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికలు బీజేపీ సీఎం అభ్యర్థిగా తానే ఉంటానని త్రిపుర ముఖ్యమంత్రి మానిక్ సాహా చెప్పుకొచ్చారు. ఈ ఆరేడు నెలల కోసం తాను ఎన్నికల్లో పోటీ చేయడం లేదని, వచ్చే ఎన్నికలకు సైతం తానే నాయకత్వం వహిస్తానని చెప్పారు. బర్డోవాలి అసెంబ్లీ నియోజకవర్గానికి జరుగుతున్న ఉప ఎన్నికల్లో సాహా పోటీ చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రాత్రి ఇక్కడ జరిగిన ర్యాలీలో సాహా ప్రసంగించారు. ప్రపంచం చూపంతా బర్డోవాలి నియోజకవర్గం వైపు ఉంది. 'మూడు నెలలకో..ఆరు నెలలకో..ఏడు నెలలకో నేను ముఖ్యమంత్రిని కాదు. ఈసారి జరిగే అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూడా నేనే ముఖ్యమంత్రిని. ఏది ఏమిటో నాకు బాగా తెలుసు' అని ఆయన అన్నారు. 'మేము ఎన్నికల సమయంలో వాలిపోయే వలస పక్షుల వంటి వాళ్లం కాదు. బర్డోవాలి నియోజకవర్గంలో ప్రతి ఒక్కరితో నాకు సన్నిహిత సంబంధం ఉంది. నేను ఇక్కడే పుట్టాను. ఇక్కడే పెరిగాను. క్రీడాకారుడిగా, వైద్యునిగా, ప్రొఫెసర్‌గా నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలతో నాకు అనుబంధం ఉంది. ఇంటింటి ప్రచారం సమయంలో ఇక్కడి ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులు దగ్గరగా చూసిన వాడిని. నాకు మంచి అనుభవాలు ఉన్నాయి' అని సాహా చెప్పుకొచ్చారు. ఈ ఉపఎన్నికను యావత్ ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోందని అన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.